


'సోమశిల'లో నీటి నిల్వ



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 4,168 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.368 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 2,500, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



కిరాతకం

జీజీహెచ్ ఆసుపత్రి వద్ద బైఠాయించిన హిజ్రాలు

సహచరులతో కలిసి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని బయలుదేరిన ఓ హిజ్రాను గుర్తుతెలియని వ్యక్తులు మాటువేసి పొట్టన పెట్టుకున్నారు. కారులో వస్తున్న ఆమెను అడ్డగించి, వెంటతెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా నరికారు. ఇంతలో వెనుకనే వస్తున్న హిజ్రాలను చూసి పరారయ్యారు. కొడవలూరు మండలం టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలు హాసిని హిజ్రాల నాయకురాలు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం రేపింది. విషయం తెలుసుకున్న వెంటనే నెల్లూరు, కడప, గుంటూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాలతోపాటు తమిళనాడు నుంచి భారీ సంఖ్యలో హిజ్రాలు బుధవారం నెల్లూరుకు చేరుకుని తమ నాయకురాలిని పొట్టనపెట్టుకున్న వారిని కఠినంగా శిక్షించాలని రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావును వేడుకున్నారు. అనంతరం జీజీహెచ్‌లోని హాసిని మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు.

12



హత్యకు గురైన హాసిని (ఫైల్)



ఇక ఊరూరా

నిఘా నేత్రాలు

జిల్లాలో ఎక్కువ శాతం నేరాలను నిఘా కెమెరాల సాయంతోనే పోలీసులు ఛేదిస్తున్నారు. నేరాల నియంత్రణలోనూ సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటోంది. కెమెరాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో జరిగిన పలు కేసులను ఇప్పటికీ పోలీసులు ఛేదించలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో వీటిసంఖ్యను పెంచేందుకు పోలీస్ శాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానంతో ఇప్పటికే ఉన్న మ్యాట్రిక్స్ కెమెరాలతోపాటు గతంలో దాతలు, వ్యాపారుల సహకారంతో ఏర్పాటు చేసిన కెమెరాలను తిరిగి వినియోగంలోకి తీసుకురానున్నారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో 228 కెమెరాలను ఏర్పాటు చేయగా, రానున్న రోజుల్లో మరిన్ని కెమెరాల ఏర్పాటుకు పోలీసులు దృష్టి సారించారు.

- వివరాలు 6లో



కడలిలో కల్లోలం

బిట్రగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బోగోలు మండల సముద్రతీర ప్రాంతాల్లో బుధవారం అలలు ఎగసి పడుతున్నాయి. మూడు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తున్నా, సముద్రంలో పెద్దగా మార్పు కనిపించలేదని మత్స్యకారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం నుంచి అలల తాకిడి ఉధృతం కావడంతో సముద్రంలో అలజడి పెరిగిందని గంగ పుత్రులు తెలిపారు. సముద్రం కసురుమీద ఉండటం చూసి చేపల వేటకు వెళ్లడం మానుకున్నామన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ బెర్తులకు సుమారు 60కిపైగా బోట్లు చేరుకున్నాయి. వాటిలో జిల్లాకు చెందినవి ఐదుబోట్లు కాగా, మిగిలినవి చెన్నై, ఇతర ప్రాంతాలవి. చెన్నై బోట్లలో పనిచేస్తున్నవారు ఎక్కువమంది జిల్లా మత్స్య కారులు కావడంతో కుటుంబ సభ్యులు వారిని కలుసుకుని భోజన వసతి కల్పించారు.



ఫిషింగ్ హార్బర్‌లో చెన్నై బోట్లు

నేటి నుంచి వర్షాలు

నెల్లూరు (హరనాథపురం) : బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో గురువారం నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. జిల్లాలో బుధవారం 7.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నెల్లూరు అర్బన్లో 34.8 మి.మీ, అత్యల్పంగా మర్రిపాడులో 1.2 మి.మీ వర్షం కురిసింది. ఇందుకూరుపేట 34.2, వెంకటాచలం 34.2, ముత్తుకూరు 24.4, నెల్లూరు రూరల్ 24.2, కోవూరు 23.8, టీపీ గూడూరు 18.6, మనుబోలు 17.6, పొదలకూరు 17.2, రాపూరు 12.8, సైదాపురం 11.8, విడవలూరు 19.2, బోగోలు 5.2, బుచ్చి 5, అల్లూరు 4.4, కొడవ లూరు, దగదర్తి 3.6, కలువాయి 3.4, చేజర్ల 3.2, సంగం 2, కావలిలో 1.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.



ఒడ్డుకు చేరిన మత్స్యకారులతో మత్స్య శాఖ, మెరైన్ పోలీసులు

నడిసంద్రంలో నరకం

కాసేపట్లో ఇళ్లకు చేరుతామనుకున్న మత్స్యకారుల ఆనందం ఆవిరైంది. సముద్రంలో వారు ప్రయాణిస్తున్న పడవలోని ఇంజన్ మొరాయించింది. సాయంసంధ్యవేళ చుట్టూ నీరే. ఆపన్నహస్తం అందించే దిక్కు కూడా లేదు. అయినా బిక్కుబిక్కుమంటూ రాత్రంతా నడిసంద్రంలోనే గడిపారు. ఉదయం సమాచారం అందుకున్న మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్ల సహాయంతో అదాని కృష్ణపట్నం పోర్టు ఉన్నతాధికారుల సహాయం కోరారు. పోర్టులోని డాల్ఫిన్ టగ్ బోటును తీసుకెళ్లి సముద్రంలో నిలిచిపోయి ఉన్న పడవను పోర్టుకు తీసుకొచ్చారు. అప్పటిదాకా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపిన మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు.

3

పక్కాగా సాగునీటి సంఘాల

ఎన్నికలు

- సోమశిల ప్రాజెక్టు ఈఈ మల్లికార్జున

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం కావాలని సోమశిల ప్రాజెక్టు ఈఈ మల్లికార్జున సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈవోలు, ఏఈవోలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, పోటీలో నిలిచిన అభ్యర్థి, ఏకగ్రీవంగా ఎంపికైన అభ్యర్థి ప్రకటన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ అంకమ్మరావు, ఏఈలు, తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఈఈ మల్లికార్జున



పనులు చేయకుండా

బిల్లులంటే కుదరదు!

పనులు చేయకుండా బిల్లులు పెట్టుకుందామనుకుంటే కుదరదు.... తూతూమంత్రంగా పనులు చేసి ప్రజాధనాన్ని దోచుకుందామన్న వారి ఆటలు చెల్లవు... ఇకపై చేసిన ప్రతీ పనినీ జియో ట్యాగింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆర్అండ్‌బీ రోడ్లపై ఉన్న గుంతలను, వాటిని పూడ్చాక ఫొటోలను తప్పనిసరిగా రికార్డు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం ఇప్పుడు ఆర్అండ్‌బీలో చర్చనీయాంశంగా మారింది.

- రోడ్లపై గుంతలు పూడ్చాల్సిందే
- ఆర్అండ్‌బీలో అక్రమాలకు చెక్ పెట్టిన ప్రభుత్వం
- ప్రతీ గుంతను జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశం
- పనికి ముందు, తర్వాత ఫొటోలు తీసేలా ఉత్తర్వులు
- గతంలో వచ్చిన ఆరోపణలపై చర్యలు

నెల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గ్రామీణ రోడ్ల నుంచి స్టేట్ హైవేస్ వరకూ గుంతలు లేని రోడ్డే లేదంటే అతిశయోక్తి కాదు. నాటి ప్రభుత్వం ఒక్క గుంతనూ పూడ్చిన పాపాన పోలేదు. అయితే అప్పట్లో గుంతలు పూడ్చకుండా మెయింటెనెన్స్ పేరుతో ఏటా గుంతలు పూడ్చినట్లుగా బిల్లులు పెట్టుకొని తినేశారన్న ఆరోపణలున్నాయి. దీని వెనుక నాటి అధికార పార్టీ నేతలు, ఆర్అండ్‌బీ క్షేత్రస్థాయి అధికారులు కుమ్మక్కైనట్లు ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అక్రమాలకు చెక్ పెడుతూ నిబంధనలు కఠినతరం చేసింది.

ప్రతీది ఫొటో ఉండాలి

ఇప్పటి వరకూ అధికారులు పలానా చోట్ల గుంతలు ఉన్నాయని ప్రతిపాదించడం, ఆ తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం, తదనంతరం గుంతలు పూడ్చినట్లు బిల్లులు రికార్డు చేయడం జరుగుతోంది. అయితే నిజంగానే అక్కడ గుంతలు ఉన్నాయా..? వాస్తవంగా గుంతలు పూడ్చారా..? అన్నది ఉన్నతస్థాయిలో తెలిసేది కాదు. క్షేత్ర స్థాయి అధికారులు ఇచ్చే నివేదికల మీదనే ఆధారపడాల్సి వచ్చేది. కానీ, ఇకపై ప్రతీ గుంతను జియో ట్యాగింగ్ చేయాలని ప్రభుత్వం సరికొత్త ఉత్తర్వులు జారీ చేసింది. పనిచేసే ముందు గుంత ఎలా ఉంది..? పని చేశాక రోడ్డు ఎలా ఉంది..? అన్న ఫొటోలు తీయాలని సూచించింది. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే థర్డ్ పార్టీతో విచారణ జరిపిస్తామని కూడా ప్రభుత్వం హెచ్చరించింది. జియో ట్యాగింగ్ చేయడం, పనికి ముందు, తర్వాత ఫొటోలు తీస్తారు కాబట్టి విచారణలో సులభంగా వాస్తవాలు తెలిసిపోతాయి. ఈ విధానంతో పనులు చేయకుండా బిల్లులు పెట్టుకునే వారి అక్రమాలకు బ్రేకులు వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతల రోడ్లను బాగు చేసే పనిలో పడింది. ఇప్పటికే రూ.4.16 కోట్లను గుంతలు పూడ్చేందు కు జిల్లాకు మంజూరు చేయగా తాజాగా మరో రూ.10 కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. దాదాపుగా ప్రతీ రోడ్డుపై గుంతలను పూడ్చడమే కాకుండా జంగిల్ క్లియరెన్స్ కోసమూ నిధులిచ్చింది. జనవరి 15లోపు గుంతలన్నింటినీ పూడ్చే విధంగా ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలో గుంతలు పూడ్చే పనులకు ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు ఆహ్వానించి ఉన్నారు. ఆ పనులన్నింటికీ తాజా ఉత్తర్వుల ప్రకారం జియో ట్యాగింగ్ చేసి ఫొటోలు తీయాల్సి ఉంటుంది.

సింహపురికే తలమానికంగా నిలిచిన ఏసీ సుబ్బారెడ్డి వైద్య విద్య కళాశాల గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. 'అభివృద్ధికి ప్రతిపాదనలు పంపండి.. ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తా'మని హామీలు గుప్పించిన పాలకులు ఆచరణలో చేతులెత్తేశారు. దీంతో ఉన్న అరకొర సౌకర్యాల నడుమే అటు అధ్యాపకులు, ఇటు విద్యార్థులు నెట్టుకు రావాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే పేదల పాలిట ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రినీ (జీజీహెచ్) అప్పటి పాలకులు విస్మరించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులో ఉన్నా ఇందుకు అవసరమైన వైద్య పరికరాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వ వైద్య కళాశాల



వైద్య మిథ్య!

- వైసీపీ హయాంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వీర్యం
- ప్రతిపాదనలు పంపినా నిధులివ్వని వైనం
- రూ.100 కోట్ల హాస్టల్ భవనాలకు మంగళం
- పలు అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం
- జీజీహెచ్‌నూ గాలికి వదిలేశారు!
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

2013లో రూ.350 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి వచ్చింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ కళాశాలను ఎంతో అభివృద్ధి చేశారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం (2014) కూడా వైద్య కళాశాల అభివృద్ధికి తోడ్పాటు అందించింది. ఐదేళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన తోపాటు అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వైద్య కళాశాలను విస్మరించింది. కళాశాల అభివృద్ధికి కళాశాల అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మాత్రం విడుదల చేయలేదు. చివరకు ఆయుష్మాన్ భారత్ కింద కేంద్రం ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా 60:40 నిష్పత్తితో నిధులు కేటాయించాల్సి ఉంది. చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు రూ.23 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవన నిర్మాణానికి కేంద్రం నిధులు విడుదల చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 40 శాతం నిధులు ఖర్చు చేయాల్సి ఉన్నా కేంద్రం ఇచ్చిన నిధులను వైసీపీ సర్కారు పక్కదారి పట్టించిందనే విమర్శలు ఉన్నాయి. కనీసం భవన నిర్మాణం పూర్తి కావస్తున్నా కాంట్రాక్టర్‌కు రూ.8 కోట్లు చెల్లించకుండా పెండింగ్ పెట్టింది.



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

రూ.100 కోట్ల ప్రతిపాదనలు రద్దు

ప్రభుత్వ వైద్య కళాశాలలో 175 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, ఇప్పటికి రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఇప్పుడున్న భవనాలు కాకుండా విద్యార్థుల కోసం మరో రెండు హాస్టల్ భవనాలు నిర్మించాల్సి ఉంది. అలాగే పీజీ వైద్య విద్య అభ్యసించేందుకు 47 సీట్లను ఎన్ఎంసీ కేటాయించింది. వీరికి తగిన హాస్టల్ భవనాలు నిర్మించాల్సి ఉంది. ఇందుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఆ నిధులు విడుదల చేయడంలో కాలయాపన చేసి చివరకు చేతులెత్తేసింది. దీంతో ఇప్పుడున్న హాస్టల్ గదులు చాలక ఒక్కో గదిలో నలుగురు చొప్పున ఉంటున్నారు. మరోవైపు వైద్య కళాశాలలో అసలు క్రీడా మైదానమే కరువయ్యింది. మైదానం కోసం అధికారులు ప్రతిపాదనలు పంపినా మంజూరుకు నోచుకోలేదు. ఆడిటోరియం నిర్మాణం కోసం ఆసుపత్రి

- మిగతా 6లో

పంటకు బీమా..

రైతన్నకు ధీమా!

అతి వృష్టి.. అనావృష్టి.. ఏదైనా ప్రకృతి సహకరించక పంట లు దెబ్బ తింటే రైతుల బాధలు వర్ణనాతీతం. ఓ వైపు ఆరుగాలం పడిన కష్టానికి ఫలితం లేక మరోవైపు వ్యవసాయానికి చేసిన అప్పులు కర్షకులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తాయి. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం ద్వారా ఈ రబీ సీజన్‌లో వరి, మినుము, శనగలు, పెసర, వేరుశనగ పంటలకు బీమా సదుపాయం కల్పిస్తున్నారు.

- జిల్లాలో ఐదు రకాల పైరుకు వర్తింపు
- వచ్చే నెల 15వ తేదీ గడువు.. వరికి మాత్రం 31 వరకు..



నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద దిగుబడి ఆధారంగా జిల్లాలో ఐదు పంటలకు బీమా సదుపాయం కల్పిస్తున్నారు. వరి పంటను గ్రామం యూనిట్‌గా, మినుము, శనగ పంటలు మండలం యూనిట్‌గా, పెసర, వేరుశనగ పంటలు జిల్లా యూనిట్‌గా పరిగణలోకి తీసుకుంటారు. జిల్లాలో టాటా జీఏసీ ఇన్సురెన్సు కంపెనీ అమలు చేసే ఏజెన్సీగా ఉందని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. పంట రుణాలు తీసుకున్నవారికి బ్యాంకు అధికారులే బీమా వివరాలు నమోదు చేస్తారు. రుణాలు తీసుకోనివారు రైతు సేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, కామన్ సర్వీస్ సెంటర్లు, మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. మినుము, శనగ, పెసర, వేరుశనగ పంటలకు డిసెంబరు 15వ తేదీ వరకు, వరికి మాత్రం 31వ తేదీ వరకు గడువు ఉంది. ఆధారు కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, 1బీ అడంగల్, కౌలురైతు గుర్తింపు కార్డు, ఈ-పంట నమోదు, బ్యాంకు ఖాతా నెంబరు పత్రాలు అవసరం.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

పీఎంఎఫ్‌బీవై పథకంలో భాగంగా ఎకరా వరి పంటకు రైతు బీమాగా రూ.168 చెల్లిస్తే ఇన్సురెన్స్ రూ.42వేలు నష్ట పరిహారంగా ఇస్తారు. అదేవిధంగా మినుము ఎకరాకు రూ.38 చెల్లిస్తే 19వేలు, శనగకు రూ.56 చెల్లిస్తే 28వేలు, పెసరకు రూ.36 చెల్లిస్తే 18వేలు, వేరుశనగకు రూ.60 చెల్లిస్తే 30వేలు బీమా ఇవ్వనున్నారు.

గడువులోగా బీమా చేయించుకోవాలి



రబీ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఐదు రకాల పంటలకు ప్రభుత్వం బీమా వర్తింపచేస్తోంది. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకు అధికారులు ప్రీమియం వసూలు చేస్తారు. రుణాలు తీసుకోని రైతులు మాత్రం నిర్దేశించిన గడువులోపు బీమా ప్రీమియం చెల్లించాలి.

- పి.సత్యవాణి, జిల్లావ్యవసాయాధికారి

నీటి వృథా కనిపించదా..?



కొండాపురం వ్యవసాయ శాఖ కార్యాల యం సమీపాన పైపులైను కొద్దిరోజులుగా లీకయి నీరు వృథాగా పోతున్నది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. లీకయిన నీరు రోడ్డుపై నిలిచి బురదమయంగా మారింది. దీంతో అటుగా వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

- కొండాపురం, (ఆంధ్రజ్యోతి)

నిర్లక్ష్యం వీడారు !



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం బస్‌షెల్టర్ వద్ద, వలేటివారిపాలెంలోని తేమలేరు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పిచ్చి మొక్కల తీగలను బుధవారం విద్యుత్ సిబ్బంది తొలగించారు. 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. వెంటనే వారు సిబ్బందిని పంపి అల్లుకున్న పిచ్చి మొక్కల తీగలను తొలగించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

చివరి మజిలీకి చిక్కులే..!

గ్రామంలోని శ్మశానం లోపలా, బయటా పరిసరాల్లో పెద్దఎత్తున చిల్లచెట్లు, తుప్పలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో దహన సంస్కారాల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాక విషపురుగుల సంచారం ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక గ్రామంలోని చెత్తాచెదారం తెచ్చి శ్మశానంలోనే వేస్తున్నారని, చనిపోయిన జంతు వుల కళేబరాలను శ్మశానంలోనే వేస్తున్నారని వారు తెలిపారు. ఏళ్ల తరబడి శ్మశానం అభివృద్ధి పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)



శ్మశానంలో దట్టంగా పెరిగిన చిల్లచెట్లు



నెల్లూరులోని నవాబుపేట ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ఇక ఊరూరా నిఘా నేత్రాలు

- ఏర్పాటుపై పోలీసుల కసరత్తు
- నెల రోజుల్లో 228 సీసీ కెమెరాల ఏర్పాటు
- పోలీసు కమెండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం

నెల్లూరు (క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాలలోని ముఖ్యకూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గతంలోనే జిల్లావ్యాప్తంగా 534 మ్యాట్రిక్స్ కెమెరాలు ఉండగా, ఇవన్నీ జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానమై ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో నేరాలు జరిగినప్పుడు సంబంధిత పోలీసు సిబ్బంది కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తారు. గత ప్రభుత్వ హయాంలో మేట్రిక్స్ కెమెరాలపై పెద్దగా పర్యవేక్షణ లేకపోవడంతో నెల్లూరుతోపాటు పలు ప్రాంతాల్లో ఈ కెమెరాలు దిష్టిబొమ్మల్లా మారాయి. అలాగే, గతంలో వ్యాపారులు, కళాశాల యాజమాన్యం, అపార్ట్‌మెంట్లు, దాతల సహాయంతో ఆయా ప్రాంతాల్లోని దుకాణాలు, విద్యాసంస్థలు, శివారు ప్రాంతాల్లో వందల సంఖ్యల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆ కెమెరాల ఫుటేజీలు అవసరమైనప్పుడు పెన్‌డ్రైవ్‌లో కాపీ చేసుకొని నేరపరిశోధన చేస్తున్నారు. అయితే ఇవన్నీ తక్కువ క్వాలిటీ, తక్కువ మెమొరీ కలిగిన కెమెరాలివి. దీనికితోడు పర్యవేక్షణ లేకపోవడంతో వందల సంఖ్యలో కెమెరాలు పనిచేయడం లేదు.

● ఎస్పీ ప్రత్యేక దృష్టి

ఎస్పీగా జి కృష్ణకాంత్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లావ్యాప్తంగా ఉన్న నిఘా నేత్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మేట్రిక్స్ కెమెరా లన్నీ పనిచేసేలా చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే దాతలు, వ్యాపారు లు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వాటి సంఖ్యను తెలుసుకొని అవన్నీ పనిచేసే లా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులకు సూచించారు. వీటితో పాటు సబ్ డివిజన్ల వారీగా ప్రతి కూడళ్లు, బార్లు, వైన్‌షాపులు, శివారు ప్రాంతాలు, దుకాణాల వద్ద రోడ్డు కనిపించేలా విరివిగా కెమెరాలు ఏర్పాటు చేయించాలని, ఆ కెమెరాల సీసీ ఫుటేజ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ మేరకు గడిచిన నెల రోజుల్లో నెల్లూరు నగర సబ్ డివిజన్ పరిధిలో 45, నెల్లూరు రూరల్ 88, కావలి 85, కందుకూరు 9, ఆత్మకూరు 3 ఇలా జిల్లావ్యాప్తంగా 228 కెమెరాలను ఏర్పాటు చేశారు. రానున్న నెల రోజుల్లో కొత్తగా 1500లకుపైగా కెమెరాల ఏర్పాటుకు జిల్లా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

రెండు నెలల్లో జిల్లావ్యాప్తంగా..



జిల్లావ్యాప్తంగా సబ్‌డివిజన్ల వారీగా ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా అధికారులకు సూచించాము. అన్ని సీసీ కెమెరాలు పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటున్నాము. మరో రెండు నెలల్లో జిల్లావ్యాప్తంగా అధిక సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాము.

- జి కృష్ణకాంత్, ఎస్పీ

కావలి బీసీ సంక్షేమాధికారిపై విచారణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కావలి అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి కే సుధాకర్‌పై ఐటీడీఏ పీవో పరిమళ బుధవారం తన చాం బర్‌లో విచారణ జరిపారు. సుధాకర్‌పై ఓ వ్యక్తి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖకు ఫిర్యాదు చేశారు. దీంతో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అర్జునరావు జిల్లా కలెక్టర్‌ను విచా రణ జరిపి నివేదిక పంపాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ ఆనంద్ ఐటీడీఏ పీవో ను విచారణాధికారిగా నియమించారు. కావలి అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి పరిధిలోని హాస్టళ్లలో పనిచేసే మహిళలు ఈ విచారణకు హాజరయ్యారు. సుధా కర్‌పై వచ్చిన ఆరోపణలపై వారి నుంచి వివరాలను ఐటీడీఏ పీవో నమోదు చేసుకున్నారు. మంగళవారం కావలి ప్రాంత వార్డెన్లను విచారించిన విషయం విదితమే. నివేదికను కలెక్టర్‌కు అందచేస్తామని పీవో పరిమళ తెలిపారు.



కావలి ప్రాంత హాస్టళ్లలో పనిచేసే మహిళలను విచారిస్తున్న ఐటీడీఏ పీవో పరిమళ

ఆత్మస్థైర్యం నింపుతూ...

మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయి. నాయకులు, అధికారులు ఇదే విషయాన్ని పదేపదే సభల్లో కూడా ప్రస్తావిస్తూ ఉంటారు. అయితే ఆ లక్ష్యాన్ని నిజం చేసేందుకు ఓ వ్యక్తి నడుం బిగించారు. అర్ధాంగిని దూరం చేసుకున్నా... ఆమె లేని లోటు తీర్చలేనిదని భావించిన ఆయన మహిళా అభ్యున్నతికి ఏదో ఒకటి చేయాలని పరితపించారు. తన సతీమణి పేరుతో ట్రస్ట్‌ను ప్రారంభించారు. ఆ ట్రస్ట్‌లో అధికంగా గృహిణులు చేయగలిగే పనులనే, వారికి నేర్పించాలనే ధ్యేయంతో ముందడుగు వేశారు. తద్వారా వందలాది మంది మహిళలకు చేతివృత్తులు నేర్పుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు దేవిరెడ్డి శారద చారిటబుల్ (డీఎస్ఆర్) ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)



కుట్టుమిషన్ శిక్షణలో మహిళలు

- మహిళల అభ్యున్నతికి దేవిరెడ్డి శారద ట్రస్ట్ చేయూత
- చేతివృత్తుల్లో గృహిణులకు శిక్షణ
- ట్రస్టు పేరుతో ఉచిత విద్య, వైద్యం

మారుమూల గ్రామమైన అల్లూరు మండలం పురిణిలో దేవిరెడ్డి సుబ్బరామిరెడ్డి, బుజ్జమ్మలకు రెండవ కుమారుడు సుధాకర్‌రెడ్డి. విద్యాభ్యాసం పూర్తయ్యాక ఏదో సాధించాలనే పట్టుదలతో హైదరాబాద్ వెళ్లిన ఆయన రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో అడుగు పెట్టారు. వ్యాపారంలో అన్నివిధాలుగా చేదోడువా దోడుగా ఉంటున్న ఆయన భార్య దేవిరెడ్డి శారద అనారోగ్యంతో 2016, ఫిబ్రవరి 26న మృతి చెందారు. పేదవాళ్లకు నేనున్నానంటూ శారద సహాయం అందించేది. భార్య మరణానంతరం ఆమె ఆశయ సాధన కోసం సుధాకర్ రెడ్డి దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అల్లూరు మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా ట్రస్ట్‌ను ఇందుపూరు కాలువ సమీపంలో ఏర్పాటు చేశారు. అక్కడ సుందర భవనాన్ని నిర్మించి, ఉచితంగా విద్య, వైద్యంతోపాటు మధ్యతరగతివారికి అనుకూల ధరతో కల్యాణ వేదికతోపాటు మహిళల అభ్యున్నతికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. వివిధ చేతివృత్తుల్లో గృహిణులకు శిక్షణ ఇస్తున్నారు.



మగ్గం వర్క్ నేర్చుకుంటున్న మహిళలు

చేయూత

● మహిళలకు శిక్షణ ఇస్తూ..

అల్లూరు మండలంలో ఆసక్తి కలిగిన మహిళలకు వివిధ రంగాల్లో నైపుణ్యతా శిక్షణను అందిస్తున్నారు. ఇందులో భాగంగా టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సు, కంప్యూటర్ శిక్షణ, జర్దోసీ, మగ్గం వర్క్, టాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇప్పటికి 198 మందికి టైలరింగ్, 28 మందికి కంప్యూటర్, 60 మందికి జర్దోసి, మగ్గం వర్క్, 25 మందికి టాలీ కోర్సు శిక్షణ పూర్తి చేసుకొని, సర్టిఫికెట్లు పొందారు. వీరంతా వివిధ చోట్ల వారి నైపుణ్యాన్ని చూపుతూ ఆర్థిక స్వావలంభన సాధిస్తున్నారు. శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించి కుట్టుమిషన్లను ఇప్పించింది. 2022లో ప్రారంభమై ట్రస్టు నేడు విజయ పథంలో నడుస్తున్నది. సొంత వాహనాలను ఏర్పాటు చేసి మహిళలను ట్రస్ట్‌కు తీసుకెళ్లే విషయంలో అనేక జాగ్రత్తలను పాటిస్తు న్నారు సుధాకర్‌రెడ్డి. వారు ఎలాంటి అసహనానికి గురి కాకుండా ఉండేలా ఈ ట్రస్ట్ మేనేజ్‌మెంటు చూసుకుంటున్నది.

మధ్యతరగతి మహిళలకు చేయూత



ట్రస్ట్ ద్వారా సామాజిక సేవలు అందించడమే కాకుండా మహిళలు ఆర్థికంగా ఎదిగేలా మా చైర్మన్ వివిధ వృత్తుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కోర్సులను ప్రవేశపెట్టి మహిళలకు చేయూత అందించేలా ట్రస్ట్ కృషి చేస్తుంది. మధ్య తరగతి మహిళలకు చేయూతను అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తాం.

- ఇందుపూరు అనీల్ కుమార్‌రెడ్డి, సీఈవో, డీఎస్ఆర్ ట్రస్ట్

వివిధ రంగాల్లో అవకాశం



గృహిణులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తే వారి కాళ్లపై వాళ్లు నిలవడమేగాక కుటుంబానికి కూడా ఆదరువుగా ఉంటారు. ఇలా ఆలోచించి గృహిణులు ఇంటి వద్దనే ఉండి చేయగలిగే చేతి వృత్తులను ఎంపిక చేసుకొని శిక్షణ ఇస్తున్నాం. వారు ఆర్థిక స్వావలంబన సాధించడమే లక్ష్యంగా ట్రస్ట్ పని చేస్తున్నది.

- బండ్ల రామచంద్రరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి

పారిశుధ్యం, మంచినీటిపై పర్యవేక్షణకు

ప్రత్యేక యాప్

- ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం
- జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి



జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు, మంచినీటి సరఫరా పటిష్టం చేసేందుకు జిల్లాలో తొలిసారిగా ప్రత్యేక యాప్‌ను రూపొందించామని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ఎల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర అంశాలను ఆయన వివరించారు.

? గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రణాళికలు

! గ్రామాల్లో ఎక్కడైనా పారిశుధ్యం అధ్వానంగా ఉంటే ఏఎన్ఎంలు పరిశీలించి, తెలిపేందుకు తొలిసారిగా ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించాం. దీంతో సమస్యను జిల్లాతో పాటు రాష్ట్ర అధికారులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఈ విధంగా పర్యవేక్షణ చేస్తూ పారిశుధ్యాన్ని అభివృద్ధి పరుస్తున్నాం.

? మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ

! జిల్లాలో మంచినీటి పైప్‌లైన్లు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని బాగు చేయడంతోపాటు తాగునీటిలో ప్రతిరోజు క్లోరేషన్, 15 రోజులకోసారి నీటి ట్యాంకులను క్లీన్ చేసేలా చర్యలు చేపడుతున్నాం. వీధిలైట్ల నిర్వహణపై గతంలో ఏర్పాటు చేసిన సంస్థ బకాయిలు ఉందని వెళ్లిపోయింది. దీంతో పంచాయతీ నిధుల ద్వారానే వీధిలైట్ల నిర్వహణ చేపడుతున్నాం.

? సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

! జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ఉండేం దుకు మురుగు తొలగింపు, దోమల నివారణ చర్యలను చేపట్టడంతో పాటు వర్షాల సీజన్ అయిన్నందున ఈ మూడు నెలలు మరింత శ్రద్ధ వహించి జాగ్రత్తలు చేపడుతున్నాం. ఎక్కడా పెద్దగా విషజ్వరాలు విజృంభించిన సంఘటనలు జిల్లాలో లేవు.

? పల్లెల్లో అభివృద్ధి పనులు ఎలా..

! గ్రామాలకు ప్రస్తుతం నిధులు భారీగా వస్తున్నాయి. వీటితోపాటు పల్లెల పండుగ కార్యక్రమానికి సంబంధించి జాతీయ ఉపాధి నిధులు దాదాపు రూ.75 కోట్లమేర రావడంతో గ్రామాల్లో రోడ్లు, కాలువలు, తాగునీటి ట్యాంకుల మరమ్మతులు, బస్ షెల్టర్లు, పైప్ లైన్ల పనులు జోరుగా సాగుతున్నాయి.

? అవినీతి నిర్మూలనకు చర్యలు

! గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అవినీతికి ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నాం. పనుల వివరాలను ప్రజలు సైతం తెలుసుకునేలా అన్నీ ఏర్పాట్లు చేస్తున్నాం. పనుల్లో నాణ్యత లోపించినా, పాలనలో అవినీతికి పాల్పడిన వెంటనే చర్యలు చేపడుతున్నాం. ఈ క్రమంలో ఇటీవల ముగ్గురు కార్యదర్శులను సస్పెండ్ చేశాం.

- నెల్లూరు జడ్పీ, (ఆంధ్రజ్యోతి)

వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ విజేతగా జేబీ జట్లు

● ముగిసిన వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు

కావలిటౌన్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ (వీఎస్‌యూ) అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో కావలి జేబీ డిగ్రీ కళాశాల జట్లు సత్తా చాటాయి. పట్టణ పీజీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన పోటీలు బుధవారం ముగిశాయి. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జేబీ జట్లు విజేతలుగా నిలవగా, టగ్ ఆఫ్ వార్‌లో వీఎస్‌యూ నెల్లూరు విజేతగా నిలిచింది. వాలీబాల్ ఫైనల్‌లో జేబీ, కృష్ణచైతన్య (నెల్లూరు) జట్లు తలపడగా, జేబీ విన్నర్‌గా నిలిచింది. బాల్‌బ్యాడ్మింటన్ ఫైనల్‌లో జేబీ, వీఎస్‌యూ తలపడగా జేబీ విజేతగా నిలిచింది. టగ్ ఆఫ్ వార్ ఫైనల్‌లో వీఎస్‌యూ నెల్లూరు, వెంకటగిరి ప్రభుత్వ కళాశాల జట్లు తలపడగా వీఎస్‌యూ విజేతగా నిలిచింది. పోటీలకు పీజీ కళాశాల పీడీ మణికంఠ టోర్నమెంట్ కమిటీ సెక్రటరీగా, జేబీ పీడీ ప్రసాద్‌రెడ్డి అబ్జర్వర్‌గా వ్యవహరించారు. బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వీరారెడ్డి పాల్గొని, ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు, వన్‌టౌన్ ఎస్ఐ జమాల్‌వలి, హమ్‌రాజ్, పీడీలు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్‌లో విజేత కప్ అందుకుంటున్న జేబీ కళాశాల జట్టు



బాల్‌బ్యాడ్మింటన్‌లో విజేతగా కప్పు అందుకుంటున్న జేబీ కళాశాల జట్టు

సర్పంచి చెక్ పవర్ రద్దు

చేజర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యనమదల గ్రామ పంచాయతీ సర్పంచి చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి యల్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఆదేశాలు జారీచేశారు. పూర్తి వివరాల మేరకు.. యనమదల గ్రామానికి చెందిన బొగ్గల తిరుపతిరెడ్డి గ్రామ సర్పంచి నోటి సుందరయ్య గ్రామంలో ఏర్పాటుచేసిన ఆర్‌వో ప్లాంట్ నిధులు దుర్వినియోగపరిచాడంటూ జూలై 29వ తేదీన జిల్లా కలెక్టరు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ అనంతరం సమర్పించిన నివేదిక మేరకు తాత్కాలికంగా మూడునెలల పాటు సర్పంచి చెక్ పవర్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. అదేవిధంగా 15 రోజులలోపు లిఖితపూర్వక వివరణ సమర్పించాలని, లేనట్లయితే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చేజర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటూరుకండ్రిగ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కలువాయి మండలం వెదనపర్తి గ్రామానికి చెందిన నాదెళ్ళ మస్తానయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం అటుగా వస్తున్న ప్రయాణికులు గుర్తించి 108 వాహనానికి సమాచారం ఇచ్చి పొదలకూరు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు, మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ప్రయివేటు వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

వైద్య మిథ్య!

(5వ పేజీ తరువాయి)

ప్రాంగణంలో స్థలం కూడా కేటాయించారు. కానీ ప్రభుత్వం మంజూరు చేయలేదు.

● జీజీహెచ్‌కు పరికరాలేవీ!?

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) 750 పడకలు ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నా ఇందుకు అవసరమైన వైద్య పరికరాలు లేవు. 10 ఆపరేషన్ థియేటర్లకు అవసరమైన పరికరాలు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. ఉదాహరణకు న్యూరోసర్జరీ విభాగంలో ఇద్దరు వైద్యులు ఉండగా, పరికరాలు మాత్రం సమకూర్చలేకపోయారు. అలాగే ఆర్థోపెడిక్ విభాగంలోనూ వైద్య పరికరాల కొరత తీవ్రంగా ఉంది. అత్యవసర మందులకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. ఇదిలా ఉంటే పాత భవనాలు కూల్చి కొత్త భవనాలు నిర్మించాల్సి ఉన్నా అవి నేటికీ ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి.

మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం



గత ప్రభుత్వంలో వైద్య కళాశాలలో అవసరాలకు కొన్ని ప్రతిపాదనలు పంపాము. కానీ అనుమతులు రాలేదు. హాస్టల్ భవనాలు పూర్తయితే విద్యార్థులకు వెసులుబాటుగా ఉంటుంది. అలాగే ఆడిటోరియం, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక జీజీహెచ్‌లో కొన్ని నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. చిన్న చిన్న పనులు కూడా అవసరం అవుతాయి. వాటిని ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా పూర్తి చేస్తాం. అలాగే వైద్యులు, ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. వీటన్నిటి ప్రతిపాదనలను మళ్లీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.

- డాక్టర్ నాగ రాజమన్నార్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్



మేమే 'స్పీడ్ బ్రేకర్స్'

సహజంగా పొద్దుగూకితే తెల్లపశువులు (ఆవులు) వాటి స్థావరాలకు వెళ్లి పడుకుంటాయి. కానీ కావలిలో మాత్రం రాత్రయితే ట్రంకురోడ్డును స్థావరంగా చేసుకుని అవి పండుకుంటున్నాయి. వీటివల్ల రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది. దగ్గరకు వచ్చేవరకు ఆవులు కనిపించకటపోవడం.. హారన్ కొట్టినా అవి కదలకపోవటంతో ఎక్కడ ప్రమాదాలకు గురవుతామోనని వాహనచోదకులు హడలిపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై ఆవులు సంచారం లేకుండా, అవి సేద తీరకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. తమ వల్ల వాహనదారులకు ప్రమాదమని ఆ మూగజీవులకు తెలియదుగా..?!.

- కావలి, (ఆంధ్రజ్యోతి)



ఆ పాఠశాలలో 'గంట' మోగింది!

విద్యావ్యవస్థలో మార్పులు తీసుకువచ్చి ఉన్నత పాఠశాలల సమయం మరో గంట పొడిగింపునకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయుల నుంచి భిన్నవాదనలు వస్తుండడంతో ప్రతి మండలానికి ఒక పాఠశాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి వారం రోజులు అదనపు సమయం పాఠశాల నిర్వహించాలని సూచించింది. ఇందులో భాగంగా మనుబోలు బాలుర పాఠశాలను ఎంపిక చేసింది. ఈ పాఠశాలలో 471 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ నెల 25 నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిపై మంగళవారం నెల్లూరు డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి పరిశీలించారు. అదనపు సమయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 30న అదనపు సమయం నిర్వహణపై పిల్లలు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీలు, తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు.

- మనుబోలు,(ఆంధ్రజ్యోతి)



బురద ఇలా.. వెళ్లేదెలా!?

సీతారామపురం గ్రామ పంచాయతీలోని అల్లికవీధి పోతురాజు గుడి నుంచి బెస్తకాలనీ, ఎల్‌విఆర్ జూనియర్ కాలేజీ వరకు ఉన్న రహదారి వర్షం కురిస్తే రొచ్చురొచ్చుగా మారుతోంది. ద్విచక్ర వాహనాలు జారి ప్రమాదాలు జరుగుతున్నాయి. కాలేజీకి వెళ్లే విద్యార్థులు ఈ రహదారి బురదమయంగా ఉండడం వల్ల చుట్టూ రెండు కిలోమీటర్లు తిరిగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- సీతారామపురం, (ఆంధ్రజ్యోతి)

త్వరలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

● డీఎంహెచ్‌వో పెంచలయ్య



పొదలకూరు సీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

పొదలకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన 5 పడకల డయాలసిస్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. ఈ డయాలసిస్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ డయాలసిస్ సెంటర్‌కు సంబంధించిన పరికరాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో 35 మంది డయాలసిస్ రోగులను గుర్తించామని, వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని వింజమూరు, ఉదయగిరిలో మరో రెండు డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గుండెపోటుకు గురైన వారికి అత్యవసరంగా వేసేందుకు రూ.50 వేల విలువైన ఇంజక్షన్లు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ఇంజక్షన్లు వేయడం ద్వారా జిల్లాలో ఇప్పటికే 35 మందిని బతికించామని వివరించారు.

విద్యార్థులకు ఆరోగ్య కార్డులు

విద్యార్థుల్లో వ్యాధులు అరికట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ కార్డులను ప్రవేశ పెట్టిందని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. పొదలకూరులోని డీఎస్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య ప్రగతి కార్డులను అందజేశారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్, డాక్టర్ కిరణ్ రిషిత, శ్రీకావ్య, ఎంఎల్‌హెచ్ సి.సుమాంజలి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం సనత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'బాల్య వివాహాల ముక్తి భారత్'లో

అందరూ భాగస్వాములు కావాలి

● ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్



బాల్యవివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, అధికారులు

నెల్లూరు (హరనాథపురం), నవం బరు 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన బాల్య వివాహాల ముక్తి భారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల ముక్తి భారత్ ప్రచార ప్రారంభ కార్యక్రమం జరిగింది. వర్చువల్‌గా కలెక్టరేట్ తిక్కన భవన్ నుంచి ఈ కార్యక్రమంలో హేనాసుజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బాల్య వివాహాలను అడ్డుకోవటం, ప్రజలకు అవగాహన కల్పించటం కోసం ప్రచారం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు, బాలల సంరక్షణ అధికారి సురేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరపురంలో బంగారం, వెండి చోరీ



చోరీ జరిగిన ఇంట్లో చెల్లా చెదురుగా పడి ఉన్న వస్తువులు

నెల్లూరు (వెంకటేశ్వర పురం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో ఓ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు.. వెంకటేశ్వర పురంలో నివసించే మస్తాన్‌సాహెబ్ అనారోగ్యం కారణంగా నెల రోజులుగా ఇంటికి తాళం వేసి జనార్దనరెడ్డి కాలనీలోని కుమారుడు కరిముల్లా వద్ద ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం కరిముల్లా తన తండ్రి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి తండ్రికి తెలియజేశారు. మస్తాన్‌సాహెబ్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీరువాలను పగులగొట్టి వాటిలోని 10 గ్రాముల బంగారు ఉంగరా లు, రెండు వెండి గొలుసులు, రూ.50వేలు నగదు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు ఆ ఇంటిని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ మోటార్ల దొంగ అరెస్టు

● చోరీ సొత్తు స్వాధీనం

బిట్రగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఇటీవల విద్యుత్ మోటర్లను దొంగిలించిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు తిప్ప ఎస్ఐ భోజ్యా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీపాలెంకి చెందిన జంగా సుబ్బారెడ్డి తన విద్యుత్ మోటర్ చోరీకి గురైయిందని, ఈనెల 19న రాత్రి ఫిర్యాదు చేశారని తెలిపారు. పలు గ్రామాల్లో నిఘావేసి ఆరా తీయగా, నాగులవరం వద్ద అనుమానాస్పదంగా ఓవ్యక్తి తిరుగుతుండటాన్ని గమనించి విచారించామన్నారు. ఈ క్రమంలో తిప్ప గ్రామానికి చెందిన గోగుల శామ్యూల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మోటారు చోరీ చేసినట్లు తేలిందన్నారు. అంతేకాక జలదంకి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, దగదర్తి స్టేషన్ పరిధిలో మూడు విద్యుత్ మోటార్లను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతడికి సహకరించిన మరో బాలుడిని కూడా అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ వివరించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	109
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7347
వెండి కిలో ధర	రూ. 91,400
వెండి ఒక గ్రాము	రూ.94.40

మందులున్నా చౌరవ సున్నా!

- ప్రస్తుత వర్షాలకు ఇళ్లలోకి పాములు, తేళ్లు
- పల్లెల్లో ప్రజల భయాందోళన
- విష కీటకాల కాటుపై అవగాహన కరువు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులున్నట్లు ప్రచారమేదీ?
- రూ.వేలు ఖర్చుపెట్టుకుని 'ప్రైవేటు' వైద్యం
- మూఢ నమ్మకాలతో మరింత ప్రమాదం

● సీతారామపురం గ్రామంలో ఇటీవల సుబ్బారావు అనే వ్యక్తిని నాగు పాము కాటే సింది. కుటుంబ సభ్యులు, మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నప్ప టికీ అక్కడ పాముకాటుకు విరుగుడు మందు ఉండదన్న అనుమానంతో దూరంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్ వేయించు కోవటంతో సుబ్బారావు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

● ఇందుకూరుపేట మండలం మైపాడులోని గిరిజన కాలనీలో వెంకటేశ్వర్లు పొలం పని చేస్తుండగా కట్లపాము కరిచింది. కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిం చగా అక్కడ చికిత్స చేయించుని ఊపిరిపీల్చు కున్నారు. ఇందుకు వారికి రూ.15వేలు ఖర్చు అయింది. స్థానిక పీహెచ్‌సీలో పాముకాటు విరుగుడు మందు ఉందన్న విషయం వారికి తెలియకపోవ డంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చింది.





యాంటీస్నేక్ వినమ్ మందు

నెల్లూరు (వైద్యం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో పాముల బెడద ఎక్కువగా ఉంది. వర్షాలకు కలుగుల్లో దాగిన ఎలుకలు బయటకు వస్తుండటంతో వాటి కోసం పాములు వెంటపడు తున్నాయి. ఈ క్రమంలో విష సర్పాలు ఇళ్ల లోకి వస్తున్నాయి. వీటితో పాటు తేళ్లు, మండ్రగబ్బల సంచారం ఎక్కు వవడంతో పల్లె ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రతీ రోజూ జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో ఎవరో ఒకరు పాము కాటుకు గురవుతున్నారు. ఈ విష కీటకాల కాటుకు విరుగుడు మందులు అన్నీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నప్పటికీ యంత్రాం గం ప్రత్యే కంగా చొరవ చూపి పాములు, తేళ్ల కాటుకు మందు లున్నాయని ప్రచారం చేయకపోవడం, వీటిపై ప్రజలకు అవగా హన లేకపోవడంతో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇది పేదలకు ఆర్థికంగా భారమైనప్పటికీ ప్రాణాలు నిలుపుకోవడానికి తప్పడం లేదు. ఇదిలా ఉండగా కొన్ని ప్రాంతాల్లో మూఢ నమ్మకాలతో పాము, తేలు కాటు కు మంత్రాలతో కట్టుకట్టడం వల్ల జరిగే ఆలస్యం కారణంగా బాధితులు ప్రాణాపాయ స్థితికి చేరుతున్నారు. ప్రమాదకరమైన పాములివి జిల్లాలో సంచరించే పాముల్లో 90 శాతం విషం లేనివేనని నిపుణులు చెబుతున్నారు. నాలుగు రకాల విష సర్పాలు మాత్రం సంచరిస్తు న్నాయంటున్నారు. అవి నాగు పాము, కట్ల పాము, రక్త పింజెరి, సముద్రం పాము. వీటిలో సముద్రం పాము (ఆడ) అత్యంత విష తుల్య మైనది. అది కాటు వేస్తే నిమిషాల్లోనే మనిషి మరణించే ప్రమాదం ఉంది. ఎక్కువగా రైతులు, మత్స్యకారుల మృత్యు వాతకు ఇవే కారణ మవుతు న్నాయి. ప్రస్తుత కాలంలో నాగు పాము, కట్ల పాములు జనావాసాల్లో విచ్చల విడిగా తిరుగు తుండటంతో ప్రతి ఒక్కరు జాగ్ర త్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తు న్నారు.

ప్రతీ పీహెచ్‌సీలో మందులు



జిల్లాలోని ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము, తేలు కాటుకు మందు లున్నాయి. ప్రస్తుత వర్షాకాలంలో పాములు, తేళ్లు జనావాసాలకు చేరుతుంటాయి. వాటి కాటుకు గురైన వారు దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదిస్తే వెంటనే విరిగుడు మందు ఇస్తారు. ఈ విషయంపై ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి

- పాము కరిచిన వెంటనే అది ఏ జాతి పామో గమనించాలి.
- కరచిన చోటి నుంచి పైకి విషం ఎక్కకుండా తక్షణం కట్టుకట్టాలి.
- మంత్రగాళ్ల వద్దకు పోకుండా వెంటనే వైద్యుని సంప్రదించాలి.
- తేలు కాటేసినా వెంటనే వైద్యులను సంప్రదించటం ఉత్తమం.

ప్రచారం చేస్తేగా!

జిల్లా వ్యాప్తంగా 52 ప్రాథమిక, 29 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు న్నాయి. ఇవికాక 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, కావలి, కందుకూరు ఏరి యా ఆసుపత్రులు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, నెల్లూరులో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. వీటన్నింటిలో పాముకాటుకు విరుగుడైన యాంటీస్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) అందుబాటులో ఉంది. అయితే గ్రామీణ ప్రజలకు దీనిపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవటంతో అనేక మంది బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. దగ్గర్లోనే ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నా అక్కడ పాము విరుగుడు మందు ఉన్న విషయం తెలియక పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులకు బాధితులను తరలిస్తున్నారు. ఈ క్రమంలో జరిగే ఆలస్యానికి కొందరు మృత్యువాత పడుతున్నారు. ప్రధానంగా సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, పొదలకూరు, ఆత్మకూరు, సంగం, దగదర్తి, వింజమూరు తదితర మండలాల్లో పాములు, తేళ్ల సంచారం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో విరుగుడు మందులపై విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

టీ-20లీగ్ పోటీలకు

ఎంట్రీల ఆహ్వానం

నెల్లూరు (విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీ-20 లీగ్ కమ్ నాకౌట్ పోటీలకు క్రీడా జట్ల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ జట్టు పేరుతో ఉన్న లెటర్ హెడ్ మీద 20 మంది సభ్యుల వివరాలను, వారి ఆధార్ కార్డులు, ఫొటోలు, రూ.5వేల ప్రవేశ రుసుముతో ఎంట్రీ నమోదు చేసుకో వాలని కోరారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం లో గల జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లాకు చెందిన వారు, జిల్లాలో చదువుకుంటున్న ఇతర జిల్లాల వారే పోటీలకు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు నెల్లూరు ఫోన్ 9440536270, గూడూరు ఫోన్ 9985 233061, కావలి ఫోన్ 9652745899, వెంకటగిరి ఫోన్ 9959722799 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ముగిసిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలు

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలు బుధవారం మధ్యాహ్నం జరిగిన పరీక్షతో ముగిశాయని వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు.

కుష్ఠు వైకల్య బాధితులను

డీఎఫ్ఐడీకి పంపండి

● ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్ఠు వ్యాధివల్ల వైకల్యానికి గురైన వారిని డీఎఫ్ఐడీ చికిత్సా కేంద్రానికి పంపాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ప్రతీ నెల జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి అక్కడ కుష్ఠు వ్యాధికి సంబంధించిన కొత్త కేసులకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. డీపీఎంలు తప్పనిసరిగా టూర్ డైరీని, నెలవారీ నివేదికను, కొత్త కేసుల వివరాలు జిల్లా కార్యాలయాలకి అందజే యాలన్నారు. పారిశ్రామిక వాడలు, మురికి వాడలను సందర్శించి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. వైద్యాధికారులు మల్లమ్మ, ప్రసాదాచారి, నారాయణ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

పొదలకూరు, (ఆంధ్రజ్యోతి): మహిళను బెదిరించి బంగారు నగలు అపహరించుకెళ్లిన కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. పొదలకూరు ఎస్ఐ హనీఫ్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బిరదవోలు పంచాయతీ పరిధిలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో 2019లో ఓ మహిళ పశువులను మేపుకొంటుండగా కడివేటి సునీల్, బాబులు ఆ మహిళను బెదిరించి బంగారు నగలు అపహరించుకెళ్లారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపుల్ సివిల్ జడి కోర్టులో జరిగిన విచారణలో నేరం రుజువు కావడంతో బుధవారం ముద్దాయిలు కడివేటి సునీల్, బాబులుకు రెండేళ్ళ జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

రాష్ట్ర ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో డిసెంబరు 3 నుంచి జరిగే సీనియర్ స్త్రీ, పురుషుల ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక బుధవారం నెల్లూరులో జరిగింది. జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారుల ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఇండియన్ రౌండ్ పురుషుల విభాగంలో ఏ సాత్విక్, జీ వెంకట లోకేష్, ఎం కిరణ్‌తేజ, ఎం చక్రిష్ కుమార్ యాదవ్, కే లోహిత్ కుమార్ యాదవ్, ప్రసన్నకుమార్, మహిళల విభాగంలో ఎస్ నిఖిల, ఎస్ షణ్ముఖ, జే నవ్యాంజలి, జీ లక్ష్మీ ప్రశాంతి, వై చండిక, ఏ లాస్య ఎంపిక య్యారు. రికర్వ్‌రౌండ్ పురుషుల విభాగంలో ఆర్ సాయిమౌర్య, కే తరుణీష్ జాత్యా, సీహెచ్ అక్షయ్ మహదేవ్, పీ రాజేష్, డీ మనోజ్, డీ శశిధర్‌లు, మహిళల విభాగంలో డీ నిష్విత, కాంపౌండ్ రౌండ్ పురుషుల విభాగంలో ఆర్ ఆదినారాయణ, మహిళల విభాగంలో బీ హేమలత ఎంపికయ్యారు. ఈ ఎంపికలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష, ప్రధాన కార్యదర్శి పావురాల వేణు, కోచ్‌లు పర్యవేక్షించారు.

విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

నెల్లూరు(విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారానికి స్పష్టత ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కే ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. నెల్లూరులోని రామచంద్రా రెడ్డి భవన్‌లో బుధ వారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జరి గింది. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పలు పోరాటాలు చేసినా ప్రభుత్వం మాత్రం పరిష్కారం చూపకుండా ట్వీట్స్‌కే పరిమితమ వుతోందని విమర్శించారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద రూ.3,400 కోట్లు పెండింగ్ ఉండడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులకు పరీక్షల హాల్‌టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ పోస్టును ఖాళీగా ఉంచడంతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో నియామకాలు నిలిచిపోయాయన్నారు. వీటన్నింటిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమా వేశంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు నరేంద్ర, శ్రీహర్ష, నాయకులు జీవన్, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచు వర్సెస్ కార్యదర్శి

● ముదివర్తి పంచాయతీలో రగడ

విడవలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివర్తి పంచాయతీలో బుధవారం సర్పంచు, పంచాయతీ కార్యదర్శి మధ్య వివాదం నెలకొంది. వివరాల మేరకు.. పంచాయతీ కార్యాలయానికి వచ్చిన సర్పంచు విడవలూరు నిర్మలమ్మ కార్యాలయంలో ఉన్న కార్యదర్శి శ్రీనివాసులును అభివృద్ధి పనులకు సంబంధించిన ఎంబుక్‌లో సంతకాలు చేయాలని కోరారు. అందుకు ఆయన నిరాకరించడంతో వారిరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గ్రామ సర్పంచు విడవలూరు నిర్మలమ్మ మాట్లాడుతూచేసిన పనులకు బిల్లులు పెట్టకుండా పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలు ఇంటి పన్ను కడుతామని వచ్చినా కట్టించుకోకుండా గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారని, ప్రతి సంతకానికి ముడుపులు అడుగుతున్నారని ఆరోపించారు. దీనిని ప్రశ్నిస్తే చెక్ పవర్ రద్దు చేయిస్తానని బెదిరిస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అనంతరం పంచాయతీ ఉపసర్పంచు శరత్‌చంద్ర, వార్డు మెంబర్లులతో కలసి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ సర్పంచు చేసిన ఆరోపణలను ఖండించారు. తాను పంచాయతీ కార్యదర్శిగా ఇక్కడ పని చెయ్యని సమయంలో సర్పంచు కొన్ని పనులు చేశారని, ఆ పనులకు సంబంధించి సమావేశం నిర్వహించి సంతకాలు పెడుతానని తెలిపానన్నారు. సర్పంచు కొన్ని పనులు చెయ్యకుండా పనులు చేసినట్లు ఎంబుక్‌లు తయారు చేయించారని, అందువలన సంతకాలు పెట్టలేదన్నారు. అంతేకాకుండా ఒకే ఇంటికి ఇద్దరు ముగ్గురు పన్నులు కడుతామని అడుగుతున్నారని అందువలన నిరాకరించామన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోతానని ఆయన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని
ఆర్టీసీ కార్మికుల ధర్నా



కందుకూరు డిపో గ్యారేజీ గేటు ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు.డిపో కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీచార్ట్‌లు వేసి మూడేళ్లు పూర్తయినందున కొత్తగా డ్యూటీ ఛార్ట్‌లు వేయాలని, ఆటోల అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డీవై కొండలు తదితరులు మాట్లాడారు. ధర్నాలో సీసీఎస్ డెలిగేట్ నల్లూరి సుబ్బారావు, యూనియన్ నాయకులు వై. సదానందం, రహంతుల్లా, స్వామి, రవి, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం : ఏఐటీయూసీ



మాట్లాడుతున్న జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

ఆత్మకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తప్పదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె నాగరాజు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీలో కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, అరియర్స్ బకాయిలు అలాగే ఉన్నాయని, గత ఆరేళ్లుగా యూనిఫామ్ దుస్తులు, సబ్బులు, చమురు, పాదరక్షలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించడంతోపాటు, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు మునీర్‌బాష, కార్యదర్శులు బెల్లం కొండయ్య, దొమ్మరాజు వాసు, కె నాగేంద్ర, ఉపాధ్యక్షుడు పి కృష్ణయ్య, ట్రెజరర్ చెంచయ్య, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



పెదబ్బీపురంలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

ఏఎస్ పేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పిడి వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన పెద్దహబీపురం, అనుమసముద్రం గ్రామాల్లోని లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశలలో ఉన్నాయో పరిశీలించారు. 2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ గౌస్‌మొద్దిన్, ఏఈ వివేక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఖాదర్‌వలీ, కంప్యూటర్ ఆపరేటర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పని కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి మరణించిన, శాశ్వతంగా వలసవెళ్లిన వారి జాబ్‌కార్డులు తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ జాబ్‌కార్డు మంజూరు చేయాలన్నారు. గోకులం షెడ్, హార్టికల్చర్ లక్ష్యాలను అధిగమించాలన్నారు. పనుల వద్ద కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఈసీ సువార్తయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'భూమి కేటాయిస్తే ఆందోళన చేస్తాం'

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నవారిచింతల గ్రామంలో ఉదయగిరి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలకు భూమి కేటాయిస్తే ఆందోళన చేపడతామని టీడీపీ నాయకుడు ఏ రమేష్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కళాశాల యాజమాన్యం గ్రామంలోని సర్వేనెంబర్ 152లో 361.30 ఎకరాల భూమిలో 100 ఎకరాలు తమకు కేటాయించాలని తహసీల్దారు సుభద్రకు విన్నవించారన్నారు. తమ గ్రామంలో అధికంగా పశువుల మేపుకొని జీవనం సాగిస్తున్నారని, భూమిలేని నిరుపేదలూ అధికంగా ఉన్నారన్నారు. ఆ భూమి వారికి కేటాయిస్తే తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులంతా కలిసి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి సైతం తీసుకెళతామని ఆయన తెలిపారు.

40 మద్యం సీసాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్‌లో అనధికారికంగా మద్యం సీసాలు తరలిస్తున్నారని ఉన్నతాధికారులు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం దుకాణం నుంచి ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణానికి తరలిస్తున్న 40 మద్యం సీసాలతోపాటు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

బంగారు నగల చోరీపై కేసు నమోదు

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో బంగారు నగల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కాలనీకి చెందిన సగిలి జయరాజ్ అన్న ప్రసాద్ వివాహం వచ్చేనెల 8వ తేదీ జరగనుండగా, అతని స్నేహితుడు శివకేశవతో కలిసి మంగళవారం పెళ్లికార్డులు పంచి ఇంటికొచ్చారు. కాగా, జయరాజ్ నిద్రిస్తున్న సమయంలో అదే కాలనీకి చెందిన ఓ మైనర్ బాలుడు అతని మెడలో ఉన్న బంగారు గొలుసు, వేలికి ఉన్న ఒక ఉంగరాన్ని తీసి మరో ఉంగరాన్ని తీస్తుండగా జయరాజ్ మేల్కొనడంతో మైనర్ బాలుడు వెంటనే తలుపులు వేసి పరారయ్యాడు. దీంతో జయరాజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి చోరీచేసిన బంగారు నగలు రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఫేక్‌లోన్ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండండి

ఉదయగిరి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఫేక్ లోన్ యాప్స్‌తో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాప్స్ రిజర్వు బ్యాంకు ఇండియాచే ధ్రువీకరించబడినవి కావన్నారు. ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే మీ ఫోన్ కాంటాక్ట్స్, ఫోటో డౌన్‌లోడ్ చేసుకోవడంతోపాటు ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను తీసుకుంటారన్నారు. లోన్ ఆఫర్‌ను నిరాకరించినా ఖాతాకు నగదు జమ చేసి అధిక వడ్డీ వసూలు చేస్తారన్నారు. నిర్దేశించిన సమయంలో వారికి నగదు చెల్లించకపోతే మిమ్మల్ని పలురకాల ఇబ్బందులు పెడతారని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఒకవేళ మీరు మోసపోయినట్లు గుర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, లేదంటే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

మోటారు సైకిల్ బోల్తా : యువకుడి మృతి

కావలి రూరల్, నవంబరు27: అదుపుతప్పి మోటారు సైకిల్ బోల్తాపడి ఆవులూరి చక్రవర్తి(29) మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి కావలి మండలం కొత్తపల్లి సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు, జలదంకి మండలం లింగరాజు అగ్రహారానికి చెందిన చక్రవర్తి వ్యవసాయంతోపాటు బేల్దారి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. పనినిమిత్తం స్వగ్రామం నుంచి కావలి వస్తుండగా, మార్గమధ్యంలోని సీతమ్మగుంట వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చక్రవర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు పిల్లలున్నారు. చక్రవర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, ఎస్ఐ బాజిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉఫ్... ఉఫ్.. ఇంకెంత కాలం ?

- వంట చేసేందుకు కట్టెల పొయ్యే దిక్కు
- మధ్యాహ్న భోజన నిర్వాహకుల కష్టాలు



ఏపీ మోడల్ స్కూల్‌లో కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్న నిర్వాహకులు

సీతారామపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి వంట గ్యాస్ లేక నిర్వాహకులు కట్టెల పొయ్యల మీద వంట చేస్తూ అవస్థలు పడుతున్నారు. మండలంలో 34 ప్రాథమిక, 4 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1899 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో కేజీబీవీ పాఠశాల, రెండో మూడో ప్రాథమిక పాఠశాలలు మినహా మిగిలిన ఏ పాఠశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకానికి వంట గ్యాస్ లేదు. చేసేదిలేక వంట చేసే నిర్వాహకులు కట్టెలతో పొయ్యమీద వంట చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో కట్టెలు తడవడంతో అవి మండక పొగతో ఇబ్బందులు పడడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వంట చేసే సమయంలో పొగ కళ్లలోకి, శరీరంలోకి వెళ్లి శ్వాసకోస వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతుల కరువు

ప్రభుత్వ పాఠశాలల్లోని వంట ఏజెన్సీ నిర్వాహకులకు భోజనం చేసేందుకు సరైన మౌలిక వసతులు లేవు. చాలాచోట్ల వంటగదులు లేవు. చేసేదిలేక ఆరుబయట భోజనాలు వండుతున్నారు. దీనికితోడు పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు, సకాలంలో బిల్లులు రాకపోవడం, నీటి సమస్య తదితక సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ ఇస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా నేటికీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సబ్సిడీపై గ్యాస్ సరఫరా చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఇంటూరి వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు జరపాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల గురించి చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కందుకూరులో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్నందున నార్త్ బైపాస్‌రోడ్డు ఏర్పాటుచేయాలని, రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపు పనులకు నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరుచేసిన ఉద్యానకళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టాలని, కందుకూరు రూరల్ మండలానికి రామతీర్థం జలాలను అందించే ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేయాలి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు పారిశుధ్యం, తాగునీటి సరఫరా సమస్యలు రాకుండా ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్‌లో గ్రామ పంచాయతీల వారీగా ఉన్న నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో లోపాలు రాకుండా చూసుకుని, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు ఖర్చుచేయాలన్నారు. ప్రతి కార్యక్రమం పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. మండలంలోని రైతులకు సకాలంలో ఎరువులు అందించేలా తగినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం శుక్రవారం ఉదయం వ్యవసాయశాఖ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇంటూరి సుశీల, ఎంపీడీవో రత్నజ్యోతి, ఇతర అధికారులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

డ్రైనేజీ పూడికతీత పనుల పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కావలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రంకు రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ పూడికతీతను బుధవారం మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ట్రంకురోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన డ్రైనేజీలు పూడిపోవటంతో వర్షాకాలం వర్షపు నీరు రోడ్లపై పారుతున్నాయి. దీంతో రోడ్లన్నీ మురుగు నీటితో కలుషితం కావటమేకాక ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూడికతీత పనులను కమిషనర్ పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అంగన్‌వాడీ కార్యకర్త మేకల స్వాతి బుధవారం వాటర్‌బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో కే సుబ్బారెడ్డి మాట్లాడుతూ స్వాతి చేసిన కార్యక్రమం మరికొందరికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమం హెచ్ఎం జీ. వెంకటరావు, పీ శారదాదేవి, వీవీ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చెరువు గండి పూడ్చండి


లింగసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత చెరువు కట్టకు వెలుపల వైపు పడ్డ రంధ్రాన్ని పూడ్చాలని రైతులు కోరుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఈ చెరువు కట్టకు అక్కడక్కడ రంధ్రాలు పడుతున్నాయి. దీంతో చెరువు తెగే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి రంధ్రాలను పూడ్చాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా వేస్తున్నట్టు ఏఈ షేక్ ఫిరోజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపురం మండలం శాయిపేటలో స్తంభాల ఏర్పాటుతో చినపవని సబ్‌స్టేషన్‌లో సరఫరా నిలిపి వేస్తామన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

- వాహనదారుల అవస్థలు



వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు

లింగసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు లింగసముద్రం లోని కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. అడుగులోతు గుంతలు పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇక్కడ వాహనాలు ఎదురెదురుగా రావాలంటే ఇబ్బందిగా ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్యప్రణాళిక సకాలంలో పూర్తిచేయాలి



అనంతసాగరం భోజనం రుచి చూస్తున్న డిప్యూటీ డీఈవో

ఉదయగిరి రూరల్, నవం బరు 27(ఆంధ్రజ్యోతి): మండ లంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సకాలంలో పా ఠ్యప్రణాళిక పూర్తిచేసేలా చర్య లు చేపట్టాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధ వారం పట్టణంలోని నార్త్ ప్రాథ మిక పాఠశాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా విద్యా ర్థుల పఠన, అభ్యసనా సామ ర్థ్యాలను పరిశీలించారు. అనం తరం మధ్యాహ్న భోజనం రుచిచూసి విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మోనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, సలీం పాల్గొన్నారు.

● అనంతసాగరం: మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలను కందుకూరు డిప్యూటీ డీఈవో జానకిరాం బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచిచూసి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వసుంధరా దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి వల్ల కలిగే అనర్థాలపై గ్రామీణులకు ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలని న్యాయవాదులు కోరారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో లోక్ అదాలత్ కోర్టు ఆధ్వర్యంలో బుధవారం బాల్య వివాహాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీపీ హరికోటేశ్వరరావు, పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. కార్యక్రమంలో సీడీపీవో శారద, సూపర్‌వైజరు ప్రభావతి, న్యాయవాదులు బీ. వెంకటేశ్వర్లు, సులోచన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాలల రక్షణ చట్టాలపై అవగాహన

బిట్రగుంట నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు బుధవారం బాలల రక్షణ చటాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కావలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిని సౌజన్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సఖి సిబ్బంది, లీగల్ అడ్వైజర్ ప్రశాంతి, సోషల్ కౌన్సిలర్ కమల, కేస్ వర్కర్ సాధన, ప్రిన్సిపాల్ పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రేన్స్ వర్సిటీతో ఆర్ఎస్ఆర్ ఒప్పందం

బిట్రగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సంస్థ అయిన క్రేన్స్ వర్సిటీతో బుధవారం బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ వీవీఎస్ రెడ్డి తెలిపారు. క్రేన్స్ వర్సిటీ విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ రంగంలో వీఎల్ఎస్ఐ, ఎంబీడెట్ సిస్టమ్స్, ఐవోటీల్లో అత్యాధునిక శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించే వీలుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఈసీఈ విభాగాధిపతి సునీల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కావలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం కావలిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీసీ ఐక్యతాభవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు ఉరిటి గోవింద్ తెలిపారు. స్థానిక బీసీ ఐక్యతాభవన్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తొలుత ట్రంకురోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తామన్నారు. అనంతరం ఏరియా వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ ఐక్యతా భవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్‌రావు, కల్లగుంట్ల యానాదిరావు తదితరులు పాల్గొన్నారు.

శనగ రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఉదయగిరి రూరల్: వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి

ఉదయగిరి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ తీరం దాటే సమయంలో వర్షాలు కురిసే అవకాశముందని, రైతులు శనగ విత్తడం తాత్కాలికంగా నిలిపి వేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్ వెంకట సుబ్బారెడ్డి సూచించారు. బుధ వారం మండలంలోని సోమల రేగడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగు లో ఉన్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు. అనంతరం సచివాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : వరి సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి రజని సూచించారు. బుధవారం ఆమె అనుమసముద్రం, పందిపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఈవోలు చిరంజీవి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

● కందుకూరు: మండలంలోని కొండముడుసుపాలెం, కంచరగుంట గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వీ రాము ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరినాట్లకి సిద్ధమవుతున్న రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టరు వై. చెన్నకేశవులు, ప్రకృతి వ్యవసాయం మోడల్ మేకర్ పీ మాధవ, ఉద్యాన సహాయకులు ఎల్. రమాదేవి, వ్యవసాయ సహాయకులు కే శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సాగు పద్ధతులతో నాణ్యమైన దిగుబడి

- తిరుమలజ్యోతి, మండల వ్యవసాయ అధికారిణి



ఉలవపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన సాగు పద్ధతులపై ఎప్పటికప్పుడు వరి సాగు చేసే రైతులకు రైతుసేవా కేంద్రాలలో శిక్షణ ఇస్తున్నాం. తద్వారా నాణ్యమైన పంట అధిక దిగుబడితోపాటు ఆశించిన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయి.

? మండలంలో ఏటా ఎంతమేరకు వరిసాగు ఉంటుంది.

! విస్తారంగా వర్షాలు పడి చెరువులు నిండితే, 3300 ఎకరాల ఆయకట్టులో వరి సాగులోకి వస్తుంది.

? వరిసాగు రైతుల పరిస్థితి ఏమిటి.

! అక్టోబరు, నవంబరు నెల్లో కురిసిన వర్షాలకు చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రస్తుతం 200 ఎకరాల్లో నాట్లు వేయగా మరో 1000 ఎకరాల్లో నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం చెరువుల్లోని నీరు మూడునాలుగు తడులకే సరిపోతుంది.

? ప్రభుత్వం ద్వారా రైతులకు కలుగుతున్న మేలు ఏమిటి.

! వేరుశనగ రైతులకు 50 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు అందిస్తున్నాం. ఈ-క్రాప్ నమోదు ద్వారా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మకాలు, విపత్తుల్లో రైతలకు చెందాల్సిన రాయితీలు అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

1న పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయబాలాజీ ఫంక్షన్ హాలులో డిసెంబరు 1న పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవం, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. రాజశేఖర్, నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. సునీల్, ఎస్కే షారుఖ్ తెలిపారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కందుకూరు టీఆర్ఆర్, కావలి జేబీ కళాశాలల్లో చదివిన విద్యార్థులంతా ఈ మహా సమ్మేళనానికి తరలి వస్తున్నారని తెలిపారు.

30న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ఉదయగిరిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల లబ్ధిదారులకు శనివారం నగదు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందు శనివారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు, అందుబాటులో లేని వారికి 2వ తేదీన పింఛన్లు అందజేస్తారన్నారు. మండలంలోని మొత్తం 4,839 మంది లబ్ధిదారులకు రూ.2,12,32,500లు నగదు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు అయ్యప్ప పడిపూజ

అనంతసాగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అనంతసాగరంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం జరుగుతుందని గురుస్వామి రాపూరు బాలి రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమంలో మండలంలోని మాలదారులందరూ విజయవంతం చేయాలని కోరారు.

30న సంగం మండల సమావేశం

సంగం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు పద్మావతమ్మ అధ్యక్షతన ఈనెల 30 తేదీ ఉదయం గం. 10-30కు జరుగుతుందని ఎంపీడీవో షాలెట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ జరుగుతుందని ఆమె తెలిపారు. ఎంపీపీ అనుమతితో ఇతర అంశములపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె తెలిపారు.

● ఏఎస్ పేట : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసన్నకుమారి బుధవారం ప్రకటన ద్వారా తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, విద్య, వైద్యం, గృహ, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై సమీక్ష జరుగుతుందని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటీసీలు హాజరుకావాలని తెలిపారు.

● అల్లూరు : మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రజనీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని, తాగునీరు, వైద్యఆరోగ్యం, గ్రామీణ రోడ్లు, ఉపాధిహామీ, రెవెన్యూ, విద్యాశాఖ, వ్యవసాయ, హౌసింగ్, నీటిపారుదల శాఖలపై చర్చించనున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు, హాజరు కావాలని తెలిపారు.



ఎక్కడ పడితే అక్కడే!

- రైల్వే స్టేషన్‌లో ఇష్టానుసారంగా పార్కింగ్
- దారిలోనే ఆటోల నిలిపివేత
- ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం



నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఎక్కడ పడితే అక్కడ వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. 'పార్కింగ్ కాంట్రాక్ట్ పాడుకొన్నాం... స్టేషన్ మొత్తం వాహనాలతో నింపేస్తాం' అన్నట్లుగా పార్కింగ్ కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నారు. స్టేషన్ తూర్పువైపు ప్రయాణికులు స్టేషన్‌లోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా బైకులు, కార్ల పార్కింగ్‌కు అనుమతిస్తున్నారు. దీనికి తోడు ఆటో డ్రైవర్లు బాడుగుల కోసం స్టేషన్‌లోకి వచ్చేసి ఇష్టానుసారంగా వాహనాలను అడ్డంపెడుతున్నారు. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. రైల్వే అధికారులు, పోలీసులు స్పందించి స్టేషన్‌లో పార్కింగ్, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)



బాల్య వివాహాలు నేరం

వెంకటాచలం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించడంతోపాటు బాలికలకు విద్య, రక్షణ, ఆరోగ్యం వంటి వివిధ అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ భాగ్యలక్ష్మి, జీ సీతాలక్ష్మి, బీ పద్మజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత, ఏఎన్‌ఎం అనిత తదితరులున్నారు.

● పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, యుక్తవయస్సులో గర్భాలను నివారించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కేర్ క్యాంపెయిన్ ప్రోగ్రాం నెల్లూరు, ప్రకాశం జిల్లాల అధికారి డాక్టర్ వాసవి తెలిపారు. పొదలకూరులోని డీఎస్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ సీహెచ్‌వోలు మెడికల్ ఆఫీసర్లు పాఠశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ కిరణ్ రిషిత, శ్రీకావ్య, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి, ఆరోగ్య సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ మెరైన్ సిస్టమ్స్‌పై శిక్షణ



శిక్షణ సామగ్రి అందజేస్తున్న సీఈవో జగదీష్ పటేల్

ముత్తుకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక యువతకు ప్రత్యేక సాంకేతిక నైపుణ్యాలతో సాధికారత కల్పించాలనే లక్ష్యంతో కృష్ణపట్నంలోని అదానీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బుధవారం మెకానికల్ ఇంజనీరింగ్, మెరైన్ సిస్టమ్స్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి బ్యాచ్‌గా 20 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. నైపుణ్యం, ఆధారిత విద్యలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ (ఏకేపీఎల్) సీఈవో జగదీష్ పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ వ్యవహారాల హెడ్ రామ్, టెక్నో కమర్షియల్ హెడ్ రమేష్‌బాబు, కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.



మద్యం @ 24x7

- ముత్తుకూరులో సమాంతర దుకాణం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

ముత్తుకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఓ మద్యం దుకాణం ఏర్పాటు చేయాలంటే రూ.లక్షల డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొని లక్కీగా దక్కించుకున్నాక పూర్తి స్థాయిలో ప్రభుత్వం నిర్ణయించి మొత్తం డబ్బు చెల్లిస్తే ఎక్సైజ్ అధికారులు అనుమతి ఇస్తారు. దీంతో పాటు ఎక్కడ ఏర్పాటు చేస్తారో ఆ స్థలానికి అనుమతులు తీసుకుని మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవాలి. ఆ ప్రకారం మండలానికి 8 మద్యం దుకాణాలు కేటాయించారు. అయితే ముత్తుకూరులో ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ప్రధాన కూడలిలో ఏకంగా మద్యం దుకాణాన్ని తెరిశారు. అనుమతి పొందిన మద్యం దుకాణాల్లో ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. అయితే ముత్తుకూరు ఆర్‌అండ్‌బీ కాలనీ కూడలిలో గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన సమాంతర మద్యం దుకాణంలో మాత్రం 24గంటలు మద్యం విక్రయాలు కొనసాగించడం విశేషం. దీనిపై ఎక్సైజ్ అధికారులకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. మామూళ్లు అందుతుండడంతో ఈ సమాంతర మద్యం దుకాణాన్ని చూసీచూడనట్లు వదిలేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో బెల్ట్ షాపుల నివారణ పరిపాటిగా మారినా, ఇంత విచ్చలవిడిగా శాశ్వత భవనంలో ఏకంగా మద్యం దుకాణం తెరవడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అందులోనూ కూత వేటు దూరంలో అనుమతి పొందిన ప్రైవేటు దుకాణాలు ఉన్నా, ఈ అనధికార దుకాణంలో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యాన్ని విక్రయిస్తుండడం గమనార్హం. ప్రైవేటు దుకాణాల యజమానులు కొందరు తెరవెనుక ఉండి, ఈ సమాంతర మద్యం దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎక్సైజ్ అధికారులు విచారణ చేస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయి.

ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి



ప్రమాదాలు జరిగితే ఎలా కాపాడుకోవాలో.. చేసి చూపుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

విడవలూరు, నవంబరు 27(ఆంధ్ర జ్యోతి): ప్రమాదాలు జరగకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టరు రాజీవ్ దరిపా తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ప్రణాల ను కాపాడుకోవా లో ఊటుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శలు చేసి చూపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు వెంకట శేషమ్మ, ఎంఈవో నాగపద్మజ, ఎస్‌ఎంసీ చైర్మన్ సుబ్బారావు, ఏడీఆర్‌ఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి పద్మశాలి సంఘం కృతజ్ఞతలు

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోవూరు మండ లంలోని పాటూరులో చేనేతల కోసం స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినందుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అఖిల భారత పద్మశాలి సంఘం కృతజ్ఞతలు తెలిపింది. చేనేతల కష్టసుఖాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినందుకు సంఘం అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, గౌరవాధ్యక్షుడు అశ్వత్థామ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

రైతుల సంక్షేమం కోసమే 'పొలం పిలుస్తోంది'

● వ్యవసాయాధికారి కృష్ణయ్య



విడవలూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయరంగంలో ఎలాంటి పంటలు వేసుకోవాలి, ఎరువులను ఎంత మోతాదులో వేసుకోవాలి, పురుగు మందులు ఎలా పిచికారి చేసుకోవాలి, సాగునీటిని ఏ విధంగా వాడుకోవాలన్న విషయాలను రైతులకు వివరించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు క్షేత్రస్థాయిలో పంటల సాగుకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

? రబీ సీజన్‌లో ఏ రకం వరి, వేరుశనగ విత్తనాలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి.

! ఈ సీజన్‌లో ఆర్‌ఎన్‌ఆర్ 15048, కెఎన్‌ఎం 1638 వరి విత్తనాలు, ట్యాగ్-24 వేరుశనగ విత్తనాలు సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

? మండలంలో విస్తారంగా సాగైన వరి పంటకు అవసరమైన ఎరువులు సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మండలంలో రబీలో సుమారు 20వేల ఎకరాల్లో వరి, 2వేల ఎకరాల్లో వేరుశనగ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంచాం. ప్రస్తుతానికి 150 టన్నుల యూరియా అందుబాటులో ఉంది.

? కొందరు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.. వాస్తవమేనా.

! మండలంలో నకిలీ విత్తనాల విక్రయం జరగడం లేదు. ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. ఒకవేళ ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

నిందితులను అరెస్టు చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 27(ఆంధ్ర జ్యోతి): తమ కుమార్తెపై అత్యాచారయత్నం చేయడమే కాక దానిని ప్రశ్నించినందుకు తమపై దాడికి పాల్పడిన నిందితుడు, అతని స్నేహితులను అరెస్టు చేయాలని ఇందుకూరుపేట మండలం కొత్తూరుకు చెందిన తమ్మిరెడ్డి భువనేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ కుమార్తె (13)ను ఇంటికి సమీపంలోని దుకాణదారుడు వినయ్ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని తెలిపారు. వారం క్రితం తినుబండారాల కొనుగోలు వెళితే అత్యాచారం చేయబోయాడన్నారు. దీనిని ప్రశ్నించేందుకు వెళితే వినయ్, అతని స్నేహితులు 10మంది తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయబోతే పోలీసులు కేసు తీసుకోలేదని ఆరోపించారు. ఎస్పీకి ఫిర్యాదు చేస్తే ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని, కానీ ఇంతవరకు నిందితులను అరెస్టు చేయలేదని తెలిపా రు. తమకు రక్షణ కల్పించి, న్యాయం చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

నేడు జ్యోతిరావు పూలే వర్ధంతి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే 134వ వర్ధంతి గురువారం జరుగుతుందని బీసీ సంక్షేమాధికారి కే ప్రసూన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో మినీబైపాస్ రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

168 ప్రీమియంతో రూ. 42 వేల పరిహారం

నెల్లూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రబీ సాగుకు సిద్ధమైన రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ఎకరాకు రూ.168 ప్రీమియం చెల్లిస్తే వైపరిత్యాలు సంభవించి పంట నష్టం వాటిల్లితే రూ. 42 వేలు పరిహారం పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి పీ సత్యవాణి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలం లోని ఆమంచర్ల, సౌత్‌మోపూరు గ్రామాల రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో నెల్లూరు ఏడీలు శ్రీనివాసులు, నర్సోజీ, శేషగిరి రావు, ఏవో ఎస్వీ నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు విద్యార్థినికి డాక్టరేట్ ప్రదానం



స్వాతికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీ (వీఎస్‌యూ)లోని మెరైన్ బయాలజీ విభాగంలోని పరిశోధన విద్యార్థిని డాక్టర్ అత్తులూరి వెంకటస్వాతికి వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. కోవూరుకి చెందిన అత్తులూరి చలపతిరావు కుమార్తె వెంకటస్వాతి శ్రిమ్ప్ లిటోపెనియస్ ఎన్నామీలో ప్రోబయోటిక్ బ్యాక్టీరియా నిర్ధారణ, గుర్తింపు వాటి ఇమ్యూన్ ప్రతిస్పందనపై అధ్యయనంపై మెరైన్ బయాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ సీహెచ్ వెంకటరాయులు పర్యవేక్షణలో తన పరిశోధన విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో బుధవారం ఆ విద్యార్థినికి వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అభినందనలు తెలియజేసి డాక్టరేట్ ప్రదానం చేశారు.

'జనవాణి'కి ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మల్లికార్జున యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. పార్టీ సీనియర్ నాయకుడు, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర్రామిరెడ్డి, నాయకులు జమీర్, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూడికతీతకు ఆక్రమణల అడ్డు!

- తీసిన మట్టి మళ్లీ కాలువలోకే..
- రూ.29 లక్షలతో పనులు
- ప్రయోజనం శూన్యం



ఆక్రమణలకు గురైన గుడపల్లికాలువలో తీస్తున్న పూడిక

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని పలు పంట కాలువల్లో పూడికతీతకు ప్రభుత్వం రూ.29 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో కొద్ది రోజులుగా జరుగుతున్న పూడికతీత పనులకు ఆక్రమణలు అడ్డుగా మారాయి. మూడు రోజులుగా కామాక్షి కాలనీలోని గుడపల్లి కాలువలో తీస్తున్న పూడిక మట్టి మళ్లీ అక్కడే కాలువలోకి జారుతోంది. ఇక్కడ కాలువపైకి వచ్చిన ఆక్రమణలు కనీసం పూడికతీసిన మట్టి వేసేందుకు కూడా అవకాశం లేని విధంగా ఉంది. దీనితో పూడిక తీసి ఉపయోగం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఖాజానగర్‌లో కొత్త గుడపల్లికాలువ, ఇరిగేషన్ బంగ్లా వద్ద నుంచి పాత గుడపల్లి కాలువ, పీర్ల కాలువ, చుట్టుకాలువ, రేబాల కాలువ, మర్రి కాలువ తదితర కాలువల్లో తీస్తున్న పూడికతీత వర్షాలకు మళ్లీ కాలువల్లోకే చేరుతోంది. గతంలో కనిగిరి రిజర్వాయర్ నుంచి సాగునీరు పారుదల జరిగే కాలువలు, కరకట్టలు సుమారు 60 నుంచి 120 అడుగుల వెడల్పు ఉండేవి. ఇవి కాలక్రమంలో ఆక్రమణలకు గురై ప్రస్తుతం 10 అడుగులకు కుంచించుకుపోయాయి. దీంతో వరదల సమయంలో పట్టణం జలమయమయ్యే పరిస్థితికి చేరుకున్నాయి. ఇరిగేషన్ బంగ్లా నుంచి సుమారు 1.5 కిలోమీటర్ల దూరం ఉన్న గుడపల్లి కాలువను ఆక్రమించి లేఔట్లు వేసి బుచ్చిలో పేరుమోసిన ప్రజాప్రతినిధి విక్రయించుకుని సొమ్ము చేసుకోవడం గమనార్హం. 20 ఏళ్లగా ఇలా ఆక్రమణలు జరుగుతుంటే చర్యలు చేపట్టాల్సిన ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీసం ఆక్రమణలు తొలగించి కాలువ ఉనికిని కాపాడిన పాపానపోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

● ఆక్రమణలు తొలగించకుంటే ప్రమాదమే..

ఇప్పటికైనా కాలవలు, కరకట్టలు, పోరంబోకు స్థలాల్లో ఆక్రమణలను తొలగించకుంటే భవిష్యత్తులో వరదలొస్తే బుచ్చి పట్టణానికి పెద్ద ప్రమాదం తప్పదు. కాలువలు ఆక్రమిత స్థలాల్లో నివశిస్తున్న సుమారు 70శాతం కుటుంబాలకు వేరే చోట ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అయినా ఆక్రమిత స్థలాల్లో వారిని ఖాళీ చేయించడంలో అధికారులు విఫలమయ్యారు. ఆక్రమణలు తొలగింపు విషయంలో నీటిపారుదలశాఖ, నగర పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఒకరిపైన ఒకరు చెప్పుకుంటూ తప్పించుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతీసుకుని ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

'విశ్వకర్మ' లబ్ధిదారులకు కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న యశ్వంత్‌సింగ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నబజారులో ఉన్న బీజేపీ కార్యాలయంలో బుధవారం పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ మాట్లాడుతూ 18 రకాల హస్త కళాకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత సంవత్సరం పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రధాని మోదీ ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, మైనారిటీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ లాల్ ఖాజా మస్తాన్, ఖాదర్, శివ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి

● ఎంహెచ్‌వో చైతన్య



రోడ్డుపై చెత్తను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో చైతన్య

నెల్లూరు(సిటీ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినియోగంలో లేని ఖాళీ స్థలాల యజమానులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని సచివాలయ సిబ్బందికి ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య సూచించారు. బుధవారం హరనాథపురంలో రోడ్లపై చెత్త, ఖాళీ స్థలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని యజమానులకు నోటీసులివ్వాలన్నారు. వాతావరణంలో మార్పులతో దోమల బెడద ఎక్కువగా ఉందని, ఇందుకు ఖాళీ స్థలాల్లోని మురుగూ కారణమన్నారు.

నూతన ఆలోచనలతో ప్రజలకు సేవచేయాలి : మేయర్

నెల్లూరు(సిటీ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ ఉద్యోగులు నూతన ఆలోచనలతో నగరవాసులకు సేవలు అందించాలని మేయర్ పొట్లూరి స్రవంతి ఆదేశించారు. నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగంలో నూతన బాధ్యతలు స్వీకరించిన ఆర్వో ఇనయతుల్లా, ఆర్‌ఐలు బుధవారం మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర వ్యాప్తంగా ఆస్తి పన్ను వసూళ్లలో ఆశించిన ఫలితాలు సాధించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని మేయర్ సూచించారు.

బీద రవిచంద్రతో జడ్పీ సీఈవో భేటీ



బీదకు మొక్కను అందిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

నెల్లూరు (వైద్యం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను బుధవారం జిల్లా పరిషత్ సీఈవో విద్యారమ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రవిచంద్ర నివాసానికి వెళ్లి కలిశారు.

జగదేవిపేటలో 'పొలంబడి'

ఇందుకూరుపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవిపేటలో బుధవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్, డాక్టర్ లలితా శివజ్యోతి పాల్గొని మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన 30 మంది రైతులకు 14 వారాలు 14 శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. విత్తనశుద్ధిపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. వరి నారుముడిలో తెగుళ్ల నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ.రాజ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి డి.రఘునాథరెడ్డి, వీఏఏ పెంచలయ్య, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చోరీలపై అవగాహన సదస్సు

నెల్లూరు(క్రైం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదిత్య నగర్ చిల్డ్రన్స్ పార్క్‌లో సీసీఎస్ పోలీసులు బుధవారం దొంగతనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ ప్రజలు ఇళ్లు విడిచి బయటకు వెళ్లే సమయంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఉపయో గించుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ పేనేటి సుధాకర్, వాకర్స్ పాముల రమణయ్య, అమర్, రమేష్, 13వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి కాయల తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థి నేతల సమావేశం

వెంకటాచలం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలో బుధవారం విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలపై రెవల్యూషన్ స్టూడెంట్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ) ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం నేతల సమావేశం జరిగింది. ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు భూసరపు సుకుమార్ మాట్లాడుతూ భవిష్యత్ కార్యచరణ రూపొందించుకోవడానికి వచ్చే నెల 22, 23వ తేదిల్లో గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో రాష్ట్రస్థాయి సమావేశాలు జరగనున్నాయన్నారు. ఈ సమావేశానికి విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నేతలు తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

గురువారం 28 నవంబరు 2024



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు



పుష్కరిణి చుట్టూ విద్యుద్దీపాల వెలుగులు





విష్వక్సేనుడి ఊరేగింపు

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు
అంకురార్పణ

వైభవంగా లక్ష కుంకుమార్చన ● నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9- 9.30 గంటలు
ధ్వజారోహణం
మధ్యాహ్నం 12.30 గంటలు
స్నపన తిరుమంజనం
సాయంత్రం 7-9 గంటలు
చిన్నశేష వాహనం

తిరుచానూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి సన్నిధి ముఖ మండపం వద్ద సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని కొలువుదీర్చారు. కంకణభట్టాచార్యులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకొచ్చి పుట్టమన్ను సేకరించారు. మాడవీధుల్లో ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు తీసుకొచ్చారు. నవపాలికలో పుట్టమన్ను నింపి అందులో నవధాన్యాలు వేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యపు కవచంలో అమ్మవారి దర్శనం

పద్మావతి అమ్మవారు బుధవారం ముత్యపు కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ వజ్ర, వైఢూర్య, స్వర్ణాభరణాలతో దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవ వేళ మాత్రమే అమ్మవారి మూలవర్లకు ప్రత్యేకంగా తయారు చేయించిన ముత్యపు కవచాన్ని అలంకరిస్తారు.

నేడు ధ్వజారోహణం

గురువారం ఉదయం 9.30 గంటలకు ధనుర్లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రంగా అర్చకులు ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అమ్మవారితో పాటూ గజచిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొస్తారు. ధ్వజస్తంభంపైకి గజపటాన్ని ఎగురవేయడంతో ధ్వజారోహణం పూర్తవుతుంది. రాత్రికి చిన్న శేష వాహన సేవతో అమ్మవారికి వాహన సేవలు ప్రారంభమవుతాయి.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన

పద్మావతి అమ్మవారికి బుధవారం ఉదయం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖ మండపానికి ఉత్సవర్లను తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు ఆగమ శాస్త్రోక్తంగా అమ్మవారి లక్ష్మి సహస్ర నామాలను లక్షసార్లు జపిస్తూ కుంకుమార్చన చేశారు. బ్రహ్మోత్సవాలకు ముందు రోజు లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించడం ఆనవాయితీ.

నేడు రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు

- నారావారిపల్లెకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాక
- తిరుపతికి చేరుకున్న మంత్రులు అచ్చెన్న, అనగాని, బీసీ జనార్దన్
- నేడు రానున్న మరికొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, నందమూరి కుటుంబీకులు



నారావారిపల్లెకు చేరుకున్న సీఎం చంద్రబాబు

తిరుపతి/చంద్రగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో గురువారం సీఎం చంద్రబాబు తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి లోకేశ్ బుధవారం రాత్రి 7.30 గంటలకు నారావారిపల్లె చేరుకున్నారు. ఇక, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, లోకేశ్వరి మంగళవారమే నారావారిపల్లె చేరుకోగా.. నందమూరి కుటుంబీకులు వసుంధర, శ్రీమాన్, శ్రీనివాస్ తదితరులు బుధవారం మధ్యాహ్నం వచ్చారు. బాలకృష్ణ సహా పలువురు నందమూరి కుటుంబీకులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు గురువారం ఉదయం నారావారిపల్లి రానున్నట్టు సమాచారం. కాగా, కర్మక్రియల్లో భాగంగా గురువారం ఉదయం 9.30 గంటలకు చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలసి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపాన వ్యవసాయ బావి వద్దకు చేరుకుంటారు. అక్కడ రామ్మూర్తినాయుడికి కర్మక్రియలు నిర్వహిస్తారు. 10.30 గంటల కల్లా ఇంటికి చేరుకుంటారు. 11 గంటలకు ఇంటి ఎదురుగా ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్‌లో రామ్మూర్తినాయుడు చిత్రపటాన్ని ఉంచి ప్రజాప్రతినిధులు, ప్రజలు నివాళులర్పిస్తారు. అప్పటి వరకు సీఎం చంద్రబాబు అక్కడే గడుపుతారు. భోజనాలు పూర్తయ్యాక ఆయన ఇంటికి వెళతారు. గురువారం రాత్రికి నారావారిపల్లెలోనే ఉంటారా లేదా సాయంత్రమే తిరుగు ప్రయాణమవుతారా అన్నది ఇంకా ఖరారు కాలేదు. పార్టీ వర్గాలు మాత్రం చంద్రబాబు శుక్రవారం ఉదయం తిరుగు ప్రయాణమవుతారని చెబుతున్నాయి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్

నారావారిపల్లెలో భారీగా ఏర్పాట్లు

రామ్మూర్తినాయుడు కర్మక్రియల కోసం నారావారిపల్లెలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత పాతిక వేల మందికి భోజనాలు ఏర్పాటు చేయాలని భావించినా.. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో 15 వేల మందికి సరిపడా భోజనాలు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.

11 మంది మంత్రులు, 45 మంది ఎమ్మెల్యేల రాక

రామ్మూర్తి కర్మక్రియల్లో పాల్గొనేందుకు గురువారం నారావారిపల్లెకు 11 మంది మంత్రులు, సుమారు 45 మంది ఎమ్మెల్యేలు రానున్నట్లు సమాచారం. ఇప్పటికే మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్, అనగాని సత్యప్రసాద్ తిరుపతికి చేరుకున్నారు.

నారావారిపల్లెలో భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. గురువారం జరిగే రామ్మూర్తి నాయుడి కర్మక్రియల్లో పాల్గొనేందుకు బుధవారమే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సొంతూరుకు వచ్చారు. ఇక, గురువారం పెద్ద ఎత్తున వీఐపీలురానున్నారు. ఈ క్రమంలో ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం సెక్యూరిటీ బలగాలూ బుధవారం ఉదయం నుంచే గ్రామాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. గ్రామంలోకి వచ్చి.. పోయే వాళ్లు ఎవరనేది పరిశీలిస్తున్నారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సిఐలు, ఎస్‌ఐలు, దాదాపు 400 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. చంద్రబాబు ఇంటి చుట్టూ పారా మిలటరీ బలగాలను నియమించారు. పెద్దకర్మ నిర్వహించే ప్రాంతంలో తనిఖీలు జరిపారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచి డాగ్ స్క్వాడ్‌లు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్లు తనిఖీలు చేస్తున్నాయి. భోజనశాల వద్ద అదనపు బలగాలను నియమించారు. సీఎం ఇంటివద్దకు ముఖ్య నేతలు, అనుమతి వున్న వారినే లోపలికి పంపేలా ఆదేశాలు ఇచ్చారు.

మాజీ మంత్రి అమర్‌కు
చేదు అనుభవం

విమానాశ్రయంలో సీఎంను స్వాగతించేందుకు అనుమతించని సెక్యూరిటీ

కలెక్టర్ చెప్పినా వినిపించుకోని వైనం

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు బుధవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లిన మాజీ మంత్రి అమరనాథరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. వెలుపలి గేటు వద్దే ఆయన్ను సీఐఎస్ఎఫ్ అధికారులు ఆపేశారు. తాను మాజీ మంత్రినని, అధికార పార్టీ ఎమ్మెల్యేనని అమర్ చెప్పినా వినిపించుకోలేదు. విమానాశ్రయం లోపల వీఐపీ లాంజ్‌లో నిలుచున్న కలెక్టర్ వెంకటేశ్వర్ గమనించి అక్కడికి చేరుకుని సీఐఎస్ఎఫ్ సిబ్బందికి చెప్పి లోపలకు తీసుకెళ్లారు. టెర్మినల్ నుంచీ ఎయిర్‌పోర్టు రన్‌వే పైకి వెళుతుండగా అక్కడ మళ్లీ భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఆయన ఎమ్మెల్యే అంటూ కలెక్టర్ చెప్పినా అనుమతించలేదు. దీంతోస్వరంపెంచిన కలెక్టర్.. తాను జిల్లా మేజిస్ట్రేట్‌నని, ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి స్వాగతం పలకడానికి రన్‌వేపైకి వెళతారని చెప్పినా సిబ్బంది వినిపించుకోలేదు. సీఎం విమానం ల్యాండయ్యే సమయం సమీపిస్తుండడంతో తనకోసం టెర్మినల్ గేటు వద్ద ఆగిపోయిన కలెక్టర్‌ను రన్‌వేపైకి వెళ్లమని కోరినా అమర్ తాను మౌనంగా విమానాశ్రయం నుంచీ వెలుపలికి వచ్చేశారు. వెంట వచ్చిన అనుచరులు, సహచర నేతల ఎదుట అవమానం జరిగిందంటూ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది.

రన్‌వే పైకి పలువురు ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు

సీఎం చంద్రబాబుకు స్వాగతం పలకడానికి తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు, వెంకటగిరి, జీడీ నెల్లూరు ఎమ్మెల్యేలతోపాటు డాలర్స్ దివాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి తదితర టీడీపీ నాయకులు పలువురు విమానాశ్రయ రన్‌వేపైకి చేరుకున్నారు. ఎమ్మెల్యే అమర్‌ను మాత్రం విమానాశ్రయ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో వున్న వారు సీఎంకు స్వాగతం పలికేందుకు అనుమతి ఇస్తారు. సంబంధిత జాబితా కలెక్టర్ నుంచీ విమానాశ్రయ డైరెక్టర్‌కు వెళితే, ఆయన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి పంపుతారు. జాబితాలోని వ్యక్తులను వారు విమానాశ్రయం లోపలకు, రన్‌వే పైకి అనుమతిస్తారు. కలెక్టర్ కాకుండా సీఎం కార్యాలయం నుంచీ కూడా విడిగా జాబితా వస్తుంది. అందులో పార్టీ ముఖ్యుల పేర్లు ఉంటాయి. ఆ జాబితా కూడా కలెక్టర్ నుంచే విమానాశ్రయానికి వెళుతుంది. వాస్తవానికి ఈ జాబితాతో సంబంధం లేకుండా కూడా ఎమ్మెల్యేలను అనుమతించాల్సి ఉంటుంది. ఇతర ఎమ్మెల్యేలను, పదవులు లేని పార్టీ నేతలను కూడా రన్‌వే పైకి అనుమతించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది జిల్లాలోనే సీనియర్ ఎమ్మెల్యే అయిన అమరనాథరెడ్డిని అడ్డుకోవడం 'కూటమి'వర్గాల్లో చర్చనీయాంశమైంది.

రోజా.. మాట్లాడకుండానే..!



తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకున్నప్పుడల్లా మాజీ మంత్రి ఆర్కే. రోజా తీవ్రస్థాయిలో చేసే రాజకీయ విమర్శలు వివాదాస్పదమయ్యేవి. అలాంటి ఆమె బుధవారం ఉదయం భిన్నంగా వ్యవహరించారు. ఆలయం నుంచి ఎమ్మెల్సీ కల్యాణితో కలిసి వెలుపలకు వచ్చిన ఆమె.. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఇటీవల టీటీడీ ధర్మకర్తల మండలి తొలి సమావేశంలోనే తిరుమలలో రాజకీయ ప్రసంగాలు చేయకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయాలని తీర్మానించారు. దీని ప్రభావంతో ఆమె బుధవారం మాట్లాడకుండానే నవ్వుతూ వెళ్లిపోయారు.

హిజ్రా లీడర్ హాసిని హత్య

● తిరుపతిలో సహచరుల కన్నీటి వీడ్కోలు



హాసిని అంత్యక్రియల్లో పాల్గొన్న హిజ్రాలు, ఇతరులు

తిరుపతి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో దారుణ హత్యకు గురైన హిజ్రా లీడర్ హాసినికి బుధవారం సాయంత్రం తిరుపతిలో సహచరుల కన్నీటి మధ్య అంత్యక్రియలు జరిగాయి. మంగళవారం రాత్రి హత్యకు గురైన మానకల హాసిని మృతదేహాన్ని మంగళంలోని ఆమె నివాసానికి తీసుకొచ్చారు. వందలాదిగా వేచి వున్న హిజ్రాల ఏడుపులతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. 'మమ్మల్ని వదిలేసి వెళ్లిపోయావా హాసినీ.. ఇక మేమెలా బతకాలి హాసినీ.. మాకెవరు దిక్కు హాసినీ.. మాకందరికి తల్లిలా ఉన్నావు, ఏ కష్టమొచ్చినా ఆదుకునే అక్క వెళ్లిపోయింది' అంటూ కన్నీరుమున్నీరయ్యారు. హాసిని తల్లీ తోబుట్టువు కూడా వచ్చారు. అనేక ప్రాంతాల నుంచి హిజ్రాలు కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలలో తరలివచ్చారు. అంత్యక్రియలు పూర్తయ్యే దాకా పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు.

కల్లోల కడలి

● మూడు రోజులుగా ఆగిన వేట



కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాయుగుండం బలపడి తుపాన్‌గా మారుతుండటంతో కోట మండలంలోని శ్రీనివాసనత్రం, గోవిందపల్లిపాళెం గ్రామాల సమీపంలోని సముద్రం కల్లోలంగా మారింది. అలల ఉధ్రుతి పెరిగింది. బుధవారం ఉదయం నుంచి పలుచోట్ల తేలికపాటి జల్లులు పడగా, చలి పెరిగింది. మూడు రోజులుగా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకపోవడంతో జీవనోపాధి కోల్పోయారు. మరోవైపు సముద్రంలో బోట్ ఇంజన్ నిలిచిపోయి మంగళవారం సాయంత్రం మత్స్యకారులు చిక్కుకున్నారన్న సమాచారంతో ఇక్కడి మత్స్యకార గ్రామాలు ఆందోళన పడ్డాయి. స్థానికులు ఉన్నారా అని ఆరా తీశాయి. గూడూరు సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు కోట తహసీల్దారు జయజయరావు మంగళవారం అర్ధరాత్రి నుంచి అప్రమత్తమయ్యారు. చివరకు వాళ్లు నెల్లూరు జిల్లాకు చెందిన వారని, బుధవారం ఉదయం వాళ్లను అధికారులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పోలీసుశాఖ అప్రమత్తం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యుత్ పరికరాల వద్ద ఉండరాదని, చెట్ల కింద నిలబడకూడదని, కాలువలు, కల్వర్టుల వద్దకు వెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977 నెంబర్లకు ఫోను చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.





చిత్తమెరిగిన చిత్తానూరమ్మ

నేటినుంచి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు

హరి అంతరంగ అలమేలుమంగ పద్మావతి అమ్మవారికి ప్రీతిపాత్రమైనవి కార్తీక బ్రహ్మోత్సవాలు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల తర్వాత అంత వైభవంగా జరుగుతాయి తిరుచానూరు బ్రహ్మోత్సవాలు. ఏటికేడాది ఈ వేడుకలను టీటీడీ మరింత ఘనంగా నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే దీపకాంతులతో తిరుచానూరు వెలిగిపోతోంది. తిరుపతి నుంచి గరుడవారధి పైనా, కిందా ఏర్పాటు చేసిన దీపతోరణాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. నిజానికి అలిమేలు మంగమ్మకు, తిరుమల శ్రీనివాసుడికి వలే ఏడాది పొడవునా అనేక ఉత్సవాలు జరుగుతుంటాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

పద్మావతిదేవి ఆలయాన్ని తిరుచానూరులో 1820-50 సంవత్సరాల్లో హథీరాంజీ మఠాధిపతులు జీర్ణోద్ధరణ చేసినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటినుంచి అమ్మవారి ఆలయంలో నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరాది ఉత్సవాలను ఆలయ వేద పండితులు పాంచరాత్ర ఆగమం ప్రకారం నిర్వహిస్తున్నారు.

నిత్యోత్సవాలు

ప్రతిరోజూ అలిమేలు మంగతాయారుకు సుప్రభాతం, సహస్రనామార్చన, నిత్యార్చనతోపాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఏకాంతసేవ, కుంకుమార్చన, వేద ఆశీర్వచన సేవలు జరుగుతాయి.

వారోత్సవాలు

సోమవారం అష్టదళ పాదపద్మారాధన, గురువారం తిరుప్పావడ సేవ, శుక్రవారం మూలవర్లకు అభిషేకం, వస్త్రాలంకరణ సేవ, లక్ష్మీపూజ, ఉద్యానవనంలో ఉత్సవర్లకు అభిషేకం, సహస్ర దీపాలంకరణ సేవ, శనివారం సామవేద పుష్పాంజలి చేపడతారు.

పక్షోత్సవాలు

ప్రతి ఏకాదశి రోజున ద్వార పాలకులకు కర్పూర్దబింబిమాస, స్నపన విశేషాలు నిర్వహిస్తారు.

మన చిత్తానూరు

శుక మహర్షిచే పాంచరాత్ర ఆగమం ప్రకారం అమ్మవారు పూజలందుకున్న తిరుశుకనూరు కాలక్రమంలో తిరుచానూరుగా నామరూపాంతరం చెందింది అంటారు. అలర్మేల్‌మంగై క్షేత్రంగా తిరుచానూరుకు అలిమేలు మంగాపురం అనే మరో పేరుకూడా ఉంది. నేటికీ తిరుచానూరును అలిమేలు మంగాపురంగానే పిలుస్తుంటారు. ఆలర్ అంటే అలలు, మేల్ అంటే పైన మంగై అంటే అమ్మవారు. పద్మావతి అమ్మవారు పద్మసరోవరంలో అలలపై నుంచి బంగారు కమలంలో ఆవిర్భవించారని పండితులు అర్థం చెబుతారు. తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల వారు మాత్రం తరాలుగా చిత్తానూరు అనే అంటూ ఉంటారు.

కార్తికోత్సవాలు

కార్తీక మాసపు బ్రహ్మోత్సవాల్లో లక్ష కుంకుమార్చన, పుష్పయాగం నిర్వహిస్తారు. మార్గశిర మాసంలో ధనుర్మాస పూజలు, మాఘమాసంలో త్రైమాసం, శరదులు (తిరుమాంగల్యం), ఫాల్గుణమాసంలో ఫాల్గుణి ఉత్తర ఉత్సవం, చైత్రమాసంలో ఉగాది ఆస్థానం, వసంతోత్సవాలు, జేష్ఠమాసంలో పద్మసరోవరంలో తెప్పోత్సవాలు, శ్రావణమాసంలో కృష్ణాష్టమి వేడుకలు, వరలక్ష్మీ వ్రతం, భాద్రపదంలో పవిత్రోత్సవాలు, ఆశ్వయుజంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు.

మాస ఉత్సవాలు

ప్రతినెలా మొదటి బుధవారం అష్టోత్తర శతకలశాభిషేకం, పద్మావతి అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడం పురస్కరించుకుని గజవాహనసేవ, రోహిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామికి అభిషేకం, వీధోత్సవం, అష్టమి తిథిన అమ్మవారి మూలవర్లకు అభిషేకం, ఉత్తరాభాద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి, సమేత సుందరరాజ స్వామివారికి అభిషేకం, ఊంజల్ సేవ, తిరుచ్చి ఉత్సవం, ఆస్థానం జరుగుతాయి.

యాత్రికులతో కళకళ

ఒకనాటి చిత్తనూరు అలమేలుమంగ ఆలయానికి రెండువేల మంది భక్తులు మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం నిత్యం 30వేల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో పంచమీతీర్థం రోజు సుమారు లక్ష మందికి పైగా పద్మసరోవరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.



అన్నప్రసాదాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అధికారులు

అందరికీ అమ్మవారి దర్శనం

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి ● టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుచానూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులందరికీ దర్శనం కల్పిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. వాహన సేవలు, ఇతర కార్యక్రమాలను భక్తులు వీక్షించేందుకు వీలుగా తిరుచానూరు పరిసర ప్రాంతాలతోపాటూ పద్మపుష్కరిణికి నాలుగు వైపులా ఈసారి మొత్తం 20 ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. గురువారం నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. భక్తులకు సైన్ బోర్డులు, రేడియో అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామన్నారు. పంచమీతీర్థం సందర్భంగా డిసెంబరు 5వ తేదీ సాయంత్రం నుంచి భక్తులు వేచి ఉండేందుకు తిరుచానూరు పరిసర ప్రాంతాలైన జడ్పీ హైస్కూల్, పూడి రోడ్డు, నవజీవన్, తిరుచానూరు గేటు వద్ద 4 హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 120 కౌంటర్ల ద్వారా 50 వేలకుపైగా భక్తులకు తాగునీరు, బాదంపాలు, బిస్మిల్లాబాత్, పెరుగుఅన్నం, విజిటబుల్ ఉప్మాతోపాటూ ఈసారి అదనంగా చక్కెర పొంగలి అందిస్తామన్నారు. అన్నం, పప్పు, సాంబారు, రసం, స్వీట్‌తోపాటూ ఈసారి అదనంగా కర్రీని కూడా అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. అమ్మవారి వాహన సేవలను ఎస్వీబీసీలో హెచ్‌డీ క్వాలిటీతో ప్రత్యక్ష ప్రసారాలతో పాటూ, ఎస్వీబీసీ ఆన్‌లైన్ రేడియో, యూట్యూబ్ ద్వారా కూడా ప్రసారాలు అందిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో టీటీడీ భద్రతా సిబ్బంది, పోలీసులతో కలిపి 460 మంది, పంచమీతీర్థం రోజున 1500 మంది పోలీసులు, 600 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. డిసెంబరు 6న మధ్యాహ్నం 12.15 గంటల మధ్య పద్మ పుష్కరిణిలో పంచమీతీర్థం చక్రస్నానం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, విజివో సదాలక్ష్మి, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్య ప్రతీకలు స్త్రీల స్వీయ చరిత్రలు

● పోపూరి స్మారకోపన్యాసంలో ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



ప్రొఫెసర్ కాత్యాయని విద్మహేను సన్మానిస్తున్న రచయిత్రి ఓల్గా, ప్రొఫెసర్ మధుజ్యోతి, యువశ్రీ, సుభాషిణి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్త్రీలు రాసిన స్వీయ చరిత్రలు సామాజిక చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ తెలుగు రిటైర్డు ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే అన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో బుధవారం పోపూరి వెంకటసుబ్బారావు స్మారక ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. తెలుగు సాహిత్య, సామాజిక చరిత్ర స్త్రీల చరిత్రతో ముడిపడి ఉందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం మొదలు విప్లవ, దళిత, ప్రాంతీయ, మైనారిటీ వాద ఉద్యమాలనూ స్త్రీ దృక్కోణం లేకుండా పరిశీలించలేమని స్పష్టం చేశారు. అయితే, స్త్రీల ప్రతిభ, కృషి, త్యాగం మరుగున పడ్డాయనీ, ఇందుకు నేటికీ సమాజంలోని పురుషాధిపత్య భావజాల ఆధిక్యతే కారణమని అభిప్రాయపడ్డారు. సమాజాన్నీ, సాహిత్యాన్నీ స్త్రీ కోణంలో నుంచీ పరిశోధన చేపట్టవలసిన అవసరం ఉందని సూచించారు. రచయిత్రి ప్రతిమ మాట్లాడుతూ.. విద్యకు దూరంగా నెట్టివేయబడిన స్త్రీలు ఆయా రంగాల్లో ఎదిగి స్వీయ చరిత్రలు రాయడం అంత తేలికైన విషయం కాదని అన్నారు. రచయిత్రి ఓల్గా మాట్లాడుతూ.. విద్య ద్వారానే స్త్రీ చైతన్యం, స్త్రీల అభివృద్ధి, స్త్రీ సాధికారత సాధ్యమవుతాయని అన్నారు. డీన్ ప్రొఫెసర్ వాణి మాట్లాడుతూ.. తెలుగు విభాగం బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో విశేష కృషి చేస్తూ ఉందని తెలిపారు. సభాధ్యక్షత వహించిన తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా తన తండ్రి పోపూరి వెంకటసుబ్బారావు స్మారకోపన్యాసం నిర్వహించేందుకు రచయిత్రి ఓల్గా అందిస్తున్న తోడ్పాటును అభినందించారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ దొమ్మరాజు యువశ్రీ సభలో ప్రసంగించారు. 'స్త్రీ-సామాజిక భద్రత' అనే అంశంపై నిర్వహించిన కథల పోటీలో విజేతలు వాణిశ్రీ, గీతాంజలి, బాలకృష్ణలకు బహుమతులను అందజేశారు.



శ్రీవారి సుప్రభాత సేవలో
నటి జ్యోతిక

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ నటి జ్యోతిక బుధవారం దర్శించుకున్నారు. వేకువజాము సుప్రభాతసేవలో ఆమె పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది ఆమెకు ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు జ్యోతికను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న అంతర్ జిల్లా ముఠా అరెస్టు

● 1990 గ్రాములు స్వాధీనం.. మూడు కేసులు నమోదు



తిరుపతిలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్‌ఫోర్సు, తిరుపతి అర్బన్ ఎక్సైజ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. వారి నుంచి 1990 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఎక్సైజ్ అర్బన్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర తెలిపిన ప్రకారం.. ఎంఆర్‌పల్లికి చెందిన చింతగుంట చైతన్య గణేష్, అవిలాల శానప్పకాలనీకి చెందిన మంగళకుమార్, అవిలాలలో ఉంటున్న టి.రాంబాబు, ఎస్‌టీవీ నగర్‌కు చెందిన పాల్‌రాజ్, కడప పట్టణం కందిపాలేనికి చెందిన కొయ్య సోమశేఖర్, పుల్లూరుకు చెందిన గోవిందు జ్ఞానేష్, పక్కిర్‌పల్లికి చెందిన ఎస్.సుబ్బరాయుడు ఒక ముఠాగా ఏర్పడ్డారు. కొన్నేళ్లుగా వీరు గంజాయిని కొని తిరుపతికి తీసుకొస్తున్నారు. శివారు ప్రాంతాల్లో స్టాకు పెట్టి వాటిని పొడి చేసి చిన్న, చిన్న పొట్లాలుగా ప్యాక్ చేయిస్తున్నారు. ఇలా ఐదు గ్రాములు, 10 గ్రాములు, 15 గ్రాములు, 25 గ్రాముల పొట్లాల్లో ఉంచి విక్రయిస్తున్నారు. వీరి కోసం ఎక్సైజ్ ఈఎస్, టాస్క్‌ఫోర్సు అధికారులు కొద్ది రోజులుగా నిఘా ఉంచారు. కడప, తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం వచ్చింది. జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లి రెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి ఆదేశాల మేరకు ఈఎస్ టాస్క్ టాస్క్‌ఫోర్స్ సీఐ శ్యామ్‌ప్రసాద్, ఎస్ఐ ఎస్.స్వామినాథన్, అర్బన్ సీఐ రామచంద్ర, ఎస్ఐ జయశంకర్, మహేష్, నరసింహ, హరికృష్ణ, సిబ్బంది బృందాలుగా విడిపోయారు. ఎంఆర్‌పల్లి శాంతిరనగర్ వద్ద విక్రయిస్తున్న ఇద్దరిని, మంగళం వద్ద మరో ఇద్దరిని, తిరుమలరెడ్డినగర్‌లో ఒకరిని అరెస్టు చేశారు. వారి నుంచి 1990 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని మూడు కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామచంద్ర చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించింది. రూ.3.53 కోట్లు లభించినట్లు బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 64,525 మంది శ్రీవారిని దర్శించుకోగా, 19,880 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీకాళహస్తిలో తమిళ హాస్య నటుడు
యోగిబాబు



శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం తమిళ హాస్య నటుడు యోగిబాబు దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

హైదరాబాదు నుంచి శబరిమలైకి రేణిగుంట మీదుగా 18 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు, కాచిగూడ నుంచి కొట్టాయం వరకు డిసెంబరు 3 నుంచి రేణిగుంట మీదుగా 18 ప్రత్యేక రైళ్ళు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులో ఈ ప్రత్యేక రైళ్ళు(07135) డిసెంబరు3, నుంచి 10,17, 24, 31తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి బేగంపేట, వికారాబాదు, తాండూరు, రాయచూర్, గుంతకల్లు, రాజంపేట, రేణిగుంట,కాట్పాడి, కోయంబత్తూరు, పాల్‌కాడ్, ఎర్నాకులంటౌన్ మీదుగా మరుసటి రోజు 4.10 గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. ఈ ప్రత్యేక రైళ్ళు (07136) డిసెంబరు 4 నుంచి (ప్రతి గురువారం) 11, 18, 25, జనవరి ఒకటవ తేదీల్లో రాత్రి 11.45 గంటలకు కొట్టాయంలో బయలు దేరి వచ్చిన మార్గంలోనే మరుసటి రోజు హైదరాబాదుకు చేరుకుంటాయి.

● కాచిగూడలో ఈ ప్రత్యేక రైళ్ళు(07133) వచ్చే నెల 5, 12, 19, 26 తేదీల్లో(ప్రతి గురువారం) మధ్యాహ్నం 3.40 గంటలకు బయలుదేరి షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్నూలు సిటీ, రాజంపేట, రేణిగుంట,కాట్పాడి, అలువ, ఎర్నాకులంటౌన్ మీదుగా మరుసటి రోజు సాయంత్రం 6.50గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. కొట్టాయంలో ఈ ప్రత్యేక రైలు(07134) డిసెంబరు 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 8.30 గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో మరుసటి రోజు రాత్రి 11.40 గంటలకు కాచిగూడకు చేరుకుంటాయి.

పలు ప్రత్యేక రైళ్లు పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి అకోల, పూర్నా, సికింద్రాబాదు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను డిసెంబరు 6 నుంచి 30వ తేదీవరకు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు.

● తిరుపతి-అకోల మధ్య నడిచే ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం తిరుపతిలో.. ప్రతి ఆదివారం అకోలలో బయలుదేరుతుంది.

● పూర్నా- తిరుపతి మధ్య నడిచేరైలు పూర్ణాలో ప్రతి సోమవారం బయలు దేరుతుంది. ఇదే రైలు తిరుపతిలో ఈ రైలు ప్రతి మంగళవారం బయలుదేరుతుంది.


● తిరుపతి-సికింద్రాబాదు మధ్య నడిచే రైలు, తిరుపతిలో ప్రతి ఆదివారం బయలుదేరుతుంది. ఇదే రైలు సికింద్రాబాదులో ప్రతి సోమవారం బయలుదేరుతుంది.

కదిరిదేవరపల్లి- గుంతకల్ మధ్య ప్యాసింజరు రద్దు

తిరుపతి- కదిరిదేవరపల్లి మధ్య రోజువారీగా రాకపోకలు సాగిస్తున్న ప్యాసింజరు రైలు డిసెంబరు ఒకటి నుంచి 31వ తేదివరకు కదిరిదేవరపల్లి-గుంటకల్ మధ్య తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి





పొలంలో రమణయ్య మృతదేహం - రమణయ్య(ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన ఇలకా రమణయ్య(58) బుధవారం ట్రాక్టర్‌కు కేజీ వీల్స్ తగిలించుకుని పొలంలో అదును దున్నుతున్నాడు. ఈ సమయంలో విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటర్‌కు సరఫరా చేసే తీగలు ట్రాక్టర్ సైలెన్సర్‌కు తగిలాయి. దీంతో షాక్‌కు గురైన రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిగ్‌బాస్ ఫేం ప్రియాంకపై చర్యలు తీసుకోండి

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఆదరణ పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో భక్తులను భయాందోళనకు గురిచేసేలా 'తిరుపతి దారిలో మాపై చిరుతపులి ఎటాక్ చేసింది' అంటూ ప్రాంక్ వీడియో చేసిన బిగ్‌బాస్ ఫేం ప్రియాంక, ఆమె స్నేహితుడు శివపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీటీడీ సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కోరారు. ఈ మేరకు ఆయన తిరుమల డీఎస్పీకి లేఖ రాశారు. కొద్దిరోజుల క్రితం ప్రియాంక, శివ అలిపిరి కాలినడకమార్గంలో చేసిన ఈ వీడియోపై ఆయన స్పందిస్తూ ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలన్నారు. ఇదే అంశంపై ఇప్పటికే టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కూడా స్పందించిన విషయం తెలిసిందే. టీటీడీ విజిలెన్స్ నుంచి ఫిర్యాదు అందిన తర్వాత కేసు నమోదు చేయాలని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఈప్రాంక్ వీడియోపై ఇప్పటికే వార్తలు రావడంతో సోషల్ మీడియా ఖాతాల నుంచి డిలీట్ చేసినట్టు తెలుస్తోంది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రొయ్యల గుంట వద్ద గిరిజనుడి మృతి



మృతి చెందిన సంజయ్

చిట్టమూరు, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం కోగిలి రొయ్యల గుంట వద్ద గిరిజనుడు కుడుముల సంజయ్(45) బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు. మృతుడు భార్య పూజిత ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. చిల్లకూరు మండలం కడివేడు గ్రామానికి చెందిన సంజయ్ రెండు వారాల క్రితం కోగిలి గ్రామానికి చెందిన రొయ్యల గుంటల వద్ద పనిలో చేరాడు. రెండు రోజుల కిందట పూజిత తన నలుగురి పిల్లలతో కలిసి భర్త వద్దకు వెళ్లింది. అప్పటికే జ్వరంతో భాదపడు తున్న సంజయ్ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని మందులు వాడు తున్నాడు. బుధవారం సాయంత్రం రొయ్యల ఫీడు కలుపుతుండగా ఒక్క సారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే రొయ్యల గుంట యజమానికి సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి సంజయ్ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ చిన్న బలరామయ్య సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. పోస్టుమార్టం నిమిత్తం సంజయ్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పూజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి: కురుగొండ్ల



తెలుగుగంగ ఎస్ఈ రాధాకృష్ణతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని మ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఇటీవల తెలుగుగంగ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణ బుధవారం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే రామకృష్ణను కలిశారు. తుఫాను ప్రభావంపై చర్చించారు. తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, తెలుగుగంగ బ్రాంచి కాలువలు, కట్టలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇప్పటికే కండలేరు జలాశయంలో 52.438 టీఎంసీల నీటి నిల్వ ఉందని, సోమశిల నుంచి వరద నీరు వస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తిరుపతి పార్లమెంటు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాథ నాయుడు, పోలేరమ్మ దేవస్థానం మాజీ ఛైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, డక్కిలి, వెంకటగిరి రూరల్ టీడీపీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పప్పు చంద్రమౌళిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి అనుషా

వెంకటగిరి టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సివిల్ జడ్జి అనుషా అన్నారు. బుధవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎంవీ నారాయణ, న్యాయవాదులు గిరిజా కుమారి, రాజా రావు, హేమా గాంధీ తదితరులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో సీపీఎం మహాసభల

గూడూరు, వెంకటగిరి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో వచ్చే నెల 1, 2 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్లను గూడూరులో ఆ పార్టీ నాయకుడు జోగి శివకుమార్, వెంకటగిరిలో నియోజక వర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య బుధవారం ఆవిష్కరించారు.

మోటరు సైకిల్‌ను ఢీకొన్న లారీ
ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద మోటరు సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోహిత్, ఒడిశాలోని బిస్సార్‌కు చెందిన రామిరెడ్డి పెళ్లకూరు మండలంలోని రోసనూరు గ్రామంలో నిర్మిస్తున్న ఓ పరిశ్రమలో పనిచేస్తున్నారు. బుధవారం విధులు ముగించుకుని మోటరు సైకిల్‌పై నాయుడుపేటకు బయలుదేరారు. నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహిత్‌కు చేయ్యి తెగిపోగా, రామిరెడ్డికి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెల్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చెయ్యి తెగిపోయిన మోహిత్‌కు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

ధరల్లేక నిమ్మ రైతు కుదేలు



గూడూరు మార్కెట్‌లో నిమ్మ కాయల బస్తాలు

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిమ్మ కాయలకు గిట్టుబాటు ధరల్లేక రైతులు కుదేలైపోతున్నారు. గత నెల రోజులుగా నిమ్మకాయల ధరల్లో నిలకడ లేక క్రమేపీ తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన పెరిగిపోతోంది. గడిచిన కార్తీక మాసం సీజన్‌లో కిలో నిమ్మ కాయలు రూ.80 నుంచి రూ.100 వరకు, టిక్కి (50కిలోల బస్తా) బస్తా రూ.4000 నుంచి రూ.5000 తక్కువ కాకుండా అమ్ముడయ్యాయి. ప్రస్తుతం కిలో రూ.25 నుంచి రూ.40 కంటే ధర లభించకపోవడంతో ఉస్సూరుమంటున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మార్కెట్‌కు తీసుకెళ్లే ఖర్చులు పోనూ కనీస ధర కూడా చేతికందడం లేదని వాపోతున్నారు. తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాలో దిగుబడులు పెరగడంతో గూడూరు నిమ్మ మార్కెట్‌కు అంచనాకు మించి నిమ్మకాయలు చేరుకుంటున్నాయి. దీనికి తగ్గట్టుగా డిమాండ్ లేకపోవడంతో ధరలు పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మొన్నటిదాక రికార్డుస్థాయి ధరలు ఉన్నా, తోటల్లో కాయలు లేవని, ప్రస్తుతం కాయలు ఎక్కువ కావడంతో ధరలు లేక నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోత కూలీలు, రవాణాచార్జీలు, కొట్టు యజమానుల కమీషన్లు పోను టిక్కీ బస్తాకు రూ.1000 కూడా మిగలడంలేదని వాపోతున్నారు.

తైవాన్ నిమ్మరకం ధరలు దారుణం

తిరుపతి, నెల్లూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా సాగు ప్రారంభించిన తైవాన్ నిమ్మ రకానికి కనీస ధర కూడా లభించడంలేదు. తిరుపతి జిల్లాలో డక్కలి, నెల్లూరులో సైదాపురం, మనుబోలు, పొదలకూరు మండలాల్లో తైవాన్ రకం నిమ్మ సాగులో ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో తైవాన్ రకానికి కిలో కాయలు రూ.20 నుంచి రూ.25 మించి ధర లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో 29న జాబ్‌మేళా

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈనెల 29వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం బుధవారం తెలిపారు. బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ డిప్లమోలో ఉత్తర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలకు 8639835953 నంబరును సంప్రదించాలన్నారు.

30న సామూహిక కార్తీక పూజ

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి అమ్మవారి ఉపపీఠంలో ఈనెల 30వ తేదీన అమావాస్య సందర్భంగా సామూహిక కార్తీక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ బుధవారం తెలిపారు. 30వ తేదీ సాయంత్రం 4:30గంటలకు స్థానిక సాయిసత్సంగ నిలయంలో కార్తీక అమావాస్యను పురస్కరించుకుని విజయ దుర్గాదేవి అమ్మవారి నక్షత్ర నవగ్రహపూర్వక అధిదేవత, ప్రత్యధి దేవతా సహిత మహానవావరణ హోమం నిర్వహించబడుతాయన్నారు. అనంతరం భవానీ, శంకరస్వామికి భస్మాభిషేక సహిత ఏకవార రుద్రాభిషేక పూర్వక సామూహిక కార్తీక దీపారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు గురువారం సాయిసత్సంగ నిలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

చిల్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది నిర్వహించే కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా పొందుపరచాలని డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో చిల్లకూరు, చెన్నూరు, గూడూరు అర్బన్ పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సినేషన్, వైద్య పరీక్షలు వంటి కార్యక్రమాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉన్నా ఆన్‌లైన్‌లో ఎలా పొందుపరచాలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వందశాతం ఆన్‌లైన్ ఆరోగ్య కార్యక్రమాలను పొందుపరచాలని, లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యసేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నాగేంద్రకుమార్, ప్రకష్, ఆయా పీహెచ్‌సీల వైద్యులు, సీహెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు

పంట తొక్కించడంపై రైతుల ఆగ్రహం

దొరవారిసత్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వెదురుపట్టు పంచాయతీలోని నర్సమాంబపుర అగ్రహారంలో పచ్చని పంట పొలాలను తొక్కించడంపై సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి సమక్షంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆర్డీవో దొరవారిసత్రం తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్నారు. అదే సమయంలో చెరువులో ఆక్రమణలపై ఫిర్యాదు చేసిన తుంగమడుగు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మనోహర్‌రెడ్డి అక్కడే ఉండటంతో ఆయనపై ఆర్డీవో సమక్షంలోనే రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చని పంట తొక్కిచడం ఎంతవరకు సబబుని వెదురుపట్టు సర్పంచు మధురెడ్డి అధికారులను ప్రశ్నించారు. 50 ఏళ్లుగా సాగు చేసుకొంటుండగా, రాజకీయ విభేదాలతో రైతుల కడుపుకొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. చెరువులో ఆక్రమణ నేరమని, పంట తొలగింపు అంతా చట్ట ప్రకారమే జరిగిందని ఆర్డీవో చెప్పారు. సర్వే నెంబరు 44లో 9.20 ఎకరాలు, 43లో 7.50 ఎకరాలు, 35లో 5.70 ఎకరాలు చెరువు పొరంబోకు భూములు ఆక్రమణలో ఉండగా వాటిని కూడా తొలగించినట్లు తహసీల్దారు శైలాకుమారి తెలిపారు.

కూలిపోయే స్థితిలో తుఫాన్ షెల్టర్



శిథిలావస్థకు చేరిన తుఫాన్ షెల్టర్

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కొత్తపట్నం పంచాయతీ గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామంలోని తుఫాన్ షెల్టర్ కూలిపోయే స్థితిలో ఉంది. ప్రకృతి విపత్తుల సమయంలో దాదాపు 450 మత్స్యకార కుటుంబాలు ఇక్కడి తుఫాన్ షెల్టరులో తలదాచుకుంటాయి. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ తుఫాన్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకొంది. పైకప్పు పెచ్చులూడి పడుతూ కూలిపోయే స్థితిలో ఉండటంతో అక్కడికి వెళ్లేందుకు మత్స్యకారులు భయపడుతున్నారు. ప్రస్తుతం తుఫాన్ ప్రభావంతో సముద్రం ఉరకలేస్తూ పరవళ్లు తొక్కుతుండటంతో తలదాచుకునేందుకు చోటు దొరక్క మత్స్యకారులు బిక్కుబిక్కుమంటున్నారు.

జీఎస్టీ చెల్లింపులపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్

సూళ్లూరుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం జీఎస్టీ చెల్లింపుల విధానంపై జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్టీ నెంబర్‌కు ఆధార్ లింకింగ్, అమ్మకాలకు సంబంధించిన బిల్లులను రెడీ చేయడం తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ షబీనా, సిబ్బంది ప్రియదర్శిని, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

సూళ్లూరుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ హెచ్ఐవీ అంటువ్యాధి కాదని, బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. వారినీ అందరిలాగానే ఆదరించాలని సూచించారు. హెచ్ఐవీ నిర్మూలనకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పరామర్శ

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని దాదా రాయిగుంట వద్ద నివాసం ఉంటున్న టీడీపీ మైనార్టీ సెల్ సీనియర్ నాయకుడు షేక్ నౌషాద్‌ను పలువురు టీడీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఇటీవల నౌషాద్ తల్లి, కోట మాజీ ఎంపీటీసీ గౌసి నిషాబేగం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు షేక్ జలీల్ అహ్మద్, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి జగదీష్‌రెడ్డి, తీగల సురేష్ బాబు, ఎంపీటీసీలు దారాసురేష్, షంషుద్దీన్, వాకా భాస్కర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పరామర్శించారు.



నౌషాద్‌ను పరామర్శిస్తున్న జగదీష్‌రెడ్డి, టీడీపీ నేతలు

నేత్రదానం



గంగరాజు లక్ష్మయ్య (ఫైల్‌ఫోటో)

సూళ్లూరుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 446కి చేరింది. బుధవారం రైల్వేస్టేషన్ రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న గంగరాజు లక్ష్మయ్య (80) మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయకు లక్ష్మయ్య నేత్రాలను దానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, సభ్యులు ఆలపాటి అశోక్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీలే అవుట్‌లో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అన్నదానం జరిగింది. ఉదయం స్వామివారికి పంచామృతం, పాలు, పండ్లతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారికి పడిపూజ నిర్వహించారు. అయ్యప్పభక్తులు భక్తిగీతాలు ఆలపించి, భజనలు చేశారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

చిల్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడివేడు గ్రామ సమీపంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... కడివేడు గ్రామానికి చెందిన మాధవ్(22) నరేష్, రమేష్ బైక్‌పై గూడూరు నుంచి కడివేడుకు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మాధవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా, రమేష్ స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

ఓజిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏవో విజయలక్ష్మి అన్నారు. ఓజిలి మండలం వెంకటరెడ్డిపాళెం, కొండవల్లపాడు గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విత్తన ఎంపిక, శుద్ధి మొదలుకొని పంట చేతికి వచ్చే వరకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జింక్‌లోప నివారణతో అధిక దిగుబడి

నాయుడుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరిలో జింక్‌లోపం నివారణతో అధిక దిగుబడి పొందవచ్చని నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్ అన్నారు. మండలంలోని అన్నమేడు, వద్దిగుంటకండ్రిగ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ యమదిన్నెపాళెంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు అగ్నికి ఆహుతైంది. స్థానికుల కథనం మేరకు.... యమదిన్నెపాళెం ఎస్టీకాలనీకి చెందిన ఈటిపాకల రమేష్ దంపతులు ఇంటికి తాళం వేసుకొని కూలి పనులకు వెళ్లారు. ఇంట్లోని విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్‌కు గురై మంటలు ఎగిసి పూరిల్లు కాలిపోయింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా పూరిల్లు పూర్తి కాలి బూడిదైంది.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో పొణకా మల్లికార్జునరెడ్డి సహకారంతో నిరుపేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రవి, రాము, ప్రభాకర్, పెంచలయ్య, నాగరాజు, మల్లికార్జున్, కృష్ణారెడ్డి, మునిప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నెలవల జన్మదిన వేడుకలు



నెలవలకు కేక్ తినిపిస్తున్న సంచి కృష్ణయ్య

సూళ్లూరుపేట, పెళ్లకూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సూళ్లూరుపేటలోని శేష సాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులతో కలిసి నెలవల కేక్ కట్ చేశారు. సుబ్రహ్మణ్యం పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు తిరుమూరు సుధాకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, అలవల శ్రీనివాసులు, కామిరెడ్డి మురళీ రెడ్డి, శెల్వం తదితరులు పాల్గొన్నారు. అలాగే పెళ్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు నేలవల్లి సిద్దులయ్య నాయుడు, పాలచ్చూరు నరేంద్ర యాదవ్, మదన్‌మోహన్ నాయుడు, మురళీ నాయుడు, పరుశురాం తదితరులు నెలవలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేయించి తినిపించారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని
విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు చంద్రశేఖర్

గూడూరు అర్బన్, నాయుడుపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలు, ఆరోగ్య పరిస్థితులను తల్లిదండ్రులకు వివరించేందుకు డిసెంబరు 7వ తేదీన నిర్వహించనున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని గూడూరు తహసీల్దారు చంద్రశేఖర్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధ్యాయులు, వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 7వ తేదీన నిర్వహించ నున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో విద్యార్థుల సామర్థ్యాలు, ఆరోగ్య సంబంధిత వివరాలను ద్వారా తల్లిదండ్రులకు అందజేసేందుకు ఉపాధ్యాయులు సిద్దంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మధుసూదన్‌రావు, ఎంఈవో సనత్‌కుమార్ పాల్గొన్నారు. ● నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంపై ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య సుస్థిర సంబంధాలను బలోపేతం చేయడమే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఉద్దేశమని ఎంపీడీవో చెప్పారు. తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి అభిషేక ఆరాధన మహోత్సవం

నాయుడుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుదూరులో వెలసిన హనుమదీశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం అయ్యప్పస్వామి అభిషేక ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతిహోమం, అభిషేకాలు చేశారు. అనంతరం అయ్యప్పస్వామి కీర్తనలతో అభిషేక ఆరాధన మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తిబృందం పాల్గొంది.



అయ్యప్పస్వామి కీర్తనలతో పూజలు చేస్తున్న భక్తులు